
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

జనసైనికులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి,మార్చి 14 (వార్తాప్రభ) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనసైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. జన సేవా నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగుతోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కు, పార్టీ ముఖ్య నాయకులకు, జనసైనికులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

సంపుటి : 24 | సంచిక : 19 | ది. 15-3-2025 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

నామినేటెడ్ పదవులు త్వరలో భర్తీ..

-సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

అమరావతి, మార్చి 14 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇందులో భాగంగా ఆయా పదవులకు అర్హులైన వ్యక్తులను ఎంపిక చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పరిశీలన జరుగుతోందన్నారు. అయితే, కొంతమంది ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చార్జిలు నామినేషన్లకు సంబంధించిన పేర్లను సిఫారసు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని, వీటిని వేగంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో నామినేటెడ్ పదవుల భర్తీపై ఆయన స్పష్టత ఇచ్చారు."సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు చైర్మన్ల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటివరకు 60,000 దరఖాస్తులు అందాయని, వాటిని నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాదు, "ఇది ఒకే విడతలో పూర్తయ్యే ప్రక్రియ కాదు. పదవీకాలం పూర్తైన తర్వాత మిగిలినవారికి కూడా అవకాశాలు ఇస్తాం. ఇప్పటివరకు నియామకాలు పొందిన వారి పనితీరును సమీక్షిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. అర్హత, ప్రతిభ, పార్టీ కోసం చేసిన సేవ ఆధారంగా అధికార బాధ్యతలు అందిస్తామని, ఇందులో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగబోమని సీఎం తెలిపారు.

పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు.. టీడీపీ నాయకులు ఏ స్థాయిలోనూ వైఎస్సార్‌సీపీ నేతలతో సంబంధాలు పెటుకోరాదని చంద్రబాబు హెచ్చరించారు. "నేను ఇలా చెబితే... వైఎస్సార్ సీపీకి ఓటేసిన వారికి పథకాలు అందించకూడదని అర్థం కాదు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు వేరు, రాజకీయ సంబంధాలు వేరు అని ముఖ్యమంత్రి స్పష్టంగా తెలిపారు. టీడీపీ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అందేలా పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

జిల్లా మంత్రులకు సీఎం ప్రత్యేక బాధ్యతలు.. "పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వకూడదు" అని సీఎం మంత్రి వర్గ సభ్యులకు స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు తమ జిల్లాల్లో పర్యటనలు పెంచాలని, ప్రజలతో నేరుగా మమేకమవ్వాలని సూచించారు. ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించామో, అధికారంలోకి వచ్చినా అదే హుందాతనాన్ని పాటించాలి" అని ఆయన అన్నారు. నాయకులంతా సమష్టిగా పని చేస్తేనే పార్టీ మరింత బలపడుతుందని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలనే దిశగా నాయకత్వం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

జయకేతనం గ్రాండ్ సక్సెస్

- నేడు జనసేన 12వ ఆవిర్భావ సభ
- పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద జయకేతనం సభ
- మనం నిలదొక్కుకోవడమే కాదు... నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం: పవన్ కల్యాణ్

పిఠాపురం,మార్చి 14 (వార్తాప్రభ) : జనసేన ఆవిర్భావ వేడుకల సంరంభం జయకేతనం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. సరిగ్గా11 ఏళ్ల క్రితం ఇదే రోజున జనసేనను ప్రారంభించిన పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఆ తర్వాత జనసేనానిగా మారిపోయారు. మొన్నటి ఎన్నికల్లో 100 స్ట్రైక్ రేట్ తో ఏకంగా డిప్యూటీ సీఎం కూడా అయ్యారు. అదే ఊపులో నిర్వహిస్తున్న పార్టీ 12వ ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తుండగా.. పార్టీ అధిష్ఠానం ఊహకు అందనంత మేర జనం జయకేతనం వేదికకు పోటెత్తారు. ఫలితంగా సభ పూర్తి కాకుండానే సక్సెస్ అయ్యిందన్న విశ్లేషణలు మొదలయ్యాయి.జనసేనకు ప్రస్తుతం 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్న సంగతి తెలిసిందే. ఎంపీలను అలా పక్కనపెట్టినా.. పార్టీకి చెందిన ఒక్కో ఎమ్మెల్యే హీనపక్షం ఓ 50 వేల మందిని సభకు తీసుకురాగలిగితే.. దాదాపుగా 11 లక్షల మంది సభకు హాజరైనట్టు అవుతుంది. అయితే ఈ తరహా సంప్రదాయానికి పవన్ తెరదించారు. పార్టీ శ్రేణులు ఎవరికి వారే.. ఆసక్తి ఉంటేనే సభకు రావాలని పిలుపు ఇచ్చారు. ఈ పిలుపు కూడా జన సైనికులను ఓ రేంజిలో ఇంప్రెస్ చేసినట్టుంది. 10 లక్షల మందికి సరిపడ సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తే.. శుక్రవారం సభ ప్రారంభానికి ముందుగానే సభా ప్రాంగణం నిండిపోయింది. ఇంకా సభకు భారీ ఎత్తున జనం తరలివస్తూనే ఉన్నారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జన జన సైనికులు భారీ ఎత్తున చిత్రాడకు తరరివచ్చారు. వీరితో పాటుగా తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో పవన్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు పిఠాపురం చేరారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల నుంచి కూడా పవన్ ఫ్యాన్స్ చెప్పుకోదగ్గ రీతిలో భారీ సంఖ్యలోనే ఈ సభకు హాజరయ్యారు. ఫలితంగా పార్టీ యంత్రాంగం ఊహించిన దాని కంటే కూడా అధికంగా.. ఇంకా చెప్పాలంటే.. దాదాపుగా రెండింతలుగా జనం తరలివచ్చినట్లుగా చెబుతున్నారు. వెరసి జనసేన జయకేతనం గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మనం నిలదొక్కుకోవడమే కాదు... నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం: పవన్ కల్యాణ్.. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో చిత్రాడ వద్ద నిర్వహించారు. ఈ సభలో జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 2014లో అన్నీ తానై పార్టీ పెట్టానని, అనేక కష్టాలను ఎదుర్కొని ప్రస్థానం కొనసాగించానని వెల్లడించారు. 2019లో ఎన్నికల్లో పోటీ చేశామని... ఓడిపోయినా అడుగు ముందుకే వేశామని అన్నారు. "మనం నిలబడ్డాం... పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకున్నాం... మనం నిలదొక్కుకోవడమే కాకుండా నాలుగు దశాబ్దాల టీడీపీని కూడా నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మెలేశారు, జబ్బలు చరిచారు, తొడలు కొట్టారు, మన ఆడపడుచులను అవమానించారు, ప్రజలను నిరంతరం హింసించారు. ఇదేం న్యాయం అని మన జనసైనికులు, వీరమహిళలు అడిగితే, గొంతెత్తితే వాళ్లపై కేసులు పెట్టారు, జైళ్లలో పెట్టారు. నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న టీడీపీ నాయకుడ్ని అక్రమ కేసుల్లో జైల్లో బంధించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, వారి సీనియర్ నేతలను రోడ్డు మీదికి రావాలంటే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడ్ని అయితే వారు తిట్టని తిట్టు లేదు, చేయని అవమానం లేదు, చేయని కుట్ర లేదు. అసెంబ్లీ గేటు కూడా తాకలేవు అని ఛాలెంజ్ చేసి చరిచిన ఆ తొడలను బద్దలు కొట్టాం. ఏపీ అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలతోటి, పార్లమెంటులో ఇద్దరు ఎంపీలతోటి అడుగుపెట్టాం. దేశం అంతా తలతిప్పి చూసేలా 100 శాతం స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించాం... ఇవాళ జయకేతనం ఎగరేస్తున్నాం.... జై జనసేన" అంటూ పవన్ ప్రసంగించారు.

ఓడినా అడుగు ముందుకే వేశాం.. విజయం సాధించాం: పవన్ కల్యాణ్.. ఎన్నికల్లో ఓడినా అడుగు ముందుకే వేశామని, ఎన్నికల్లో విజయం సాధించామని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం శివారులోని చిత్రాడలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. "మనం నిలబడ్డాం.. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో మనం ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం" అని పవన్ వివరించారు.

నాగబాబు ఒక ఆట ఆడుకుంటారా ?

కాకినాడ, మార్చి 14 (వార్తాప్రభ) : మెగా బ్రదర్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబుకు రాజయోగం ముఖ ద్వారం నుంచే తోసుకుని వస్తోంది. అందుకే ఎలాంటి హైరానా లేకుండా ఇలా నామినేషన్ వేసి అలా పెద్దల సభలో సభ్యుడు అయిపోయారు. 2031 మార్చి 30 వరకూ నాగబాబు పదవికి వచ్చిన ఢోకా అయితే లేదు. హాయిగా ఆరేళ్ళ పాటు శాసనమండలిలో ఆయన సభ్యుడిగా హవా చలాయిస్తారు. అయితే నాగబాబు పెద్దల సభలో పెద్ద మనిషిగా కూర్చోవడానికే ఈ పదవిని చేపట్టలేదు అని అందరికీ తెలుసు అని అంటారు. ఆయనకు కేబినెట్ బెర్త్ వెంటనే రెడీ అన్న భారీ ఆఫర్ ఉంది కాబట్టే ఎమ్మెల్సీ అయ్యారు అని అంటున్నారు. ఆయన ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా నెగ్గారు. సో ఇపుడు జరగాల్సిన లాంచనం ఏంటి అంటే మంత్రి కావడమే. అది ఎపుడు అంటే సాధ్యమైనంత తొందరలోనే అని అంటున్నారు.జనసేనకు నాలుగు మంత్రి పదవులు అన్నది టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే బాబు నిర్ణయించారని అందుకే ఒక ఖాళీని అలా అట్టేబెట్టి 24 మంది మంత్రులనే తీసుకున్నారు అని అంటున్నారు. ఆ విషయం తెలియని కొందరు తమ్ముళ్ళు ఆ ఒక్క బెర్త్ తమకోసమే అని అనుకున్నారని చెబుతారు. ఇక బీజేపీ అయితే తమకు రెండవ బెర్త్ అన్నది ఇస్తారని ఆశపడుతూ వస్తోంది.అయితే ఏతా వాతా తేలేది ఏంటి అంటే ఆ 25వ మంత్రి పదవి పూర్తిగా నాగబాబు కోసమే అని. అంటే ఖాళీ అక్కడ ఉంది. అభ్యర్థి ఇక్కడ ఉన్నారు. ఇక ఆలస్యం ఏముంది. వరమాల మెడలో వేసేయడమే అని అంటున్నారు. సో మంచి ముహూర్తం చూసి నాగబాబు చేత మంత్రిగా ప్రమాణం చేయిస్తారు అని అంటున్నారు. ఇక నాగబాబుకు ఏ శాఖ ఇస్తారు అన్నది చాలా కాలంగా మెయిన్ స్ట్రీం మీడియాలో సోషల్ మీడియా నలుగుతు న్న విషయమే. ఆయన సినిమాటోగ్రఫీ శాఖ ఇస్తారని అంటే లేదు పర్యాటక శాఖ అని రాసేవారు ఉన్నారు. లేదు ఆయనకు మత్స్య శాఖ ఇస్తారని అంటే అదీ ఇదీ కాదు కీలకమైన టాప్ ఫైవ్ శాఖలలో ఒకటి అని కూడా ప్రచారం చేశారు. అయితే నాగబాబు పాలనకు కొత్త కావడంతో ఆయన మీద భారం మోపేలీ కీలక శాఖలు ఇస్తారని ఎవరూ అనుకోవడం లేదు అంటున్నారు. అదే సమయంలో జనంతో సంబంధం లేని శాఖలను కూడా ఇవ్వరని అంటున్నారు. అన్న గారి విషయంలో తమ్ముడు పవన్ కళ్యాణ్ ఆలోచిస్తున్న తీరుకు తగినట్లుగా శాఖలను కేటాయిస్తారు అని అంటున్నారు. ఆయనకు క్రీడలు యువజన విభాగాల శాఖలను ఇస్తారు అని అంటున్నారు. ఈ రెండు శాఖలూ యువతతో ముడిపడి ఉండడమే కారణం అని అంటున్నారు. ఈ శాఖలతోనే పార్టీని మరింతగా అభివృద్ధి చేసుకోవడమే కాకుండా యువతతో డైరెక్ట్ గా కనెక్ట్ కావచ్చు అన్నది జనసేనాని వ్యూహమని అంటున్నారు. ఈ శాఖలు ప్రస్తుతం కడప జిల్లాకు చెందిన మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి వద్ద ఉన్నాయి. వీటితో పాటు రవాణా శాఖ కూడా ఆయన వద్ద ఉంది. దానిని మాత్రమే ఆయనకు ఉంచేసి ఈ రెండు కీలక శాఖలను ఆయన నుంచి నాగబాబుకు అప్పగిస్తారు అని అంటు న్నారు. నాగబాబుని మంత్రిని చేసి ఏపీ అంతటా పర్యటించేలా చూడాల న్నది పవన్ ఆలోచనగా చెబుతున్నారు. ఏపీలో జనసేన బలోపేతమే లక్ష్యంగా చేసుకుని నాగబాబుని మంత్రిగా చేస్తున్నారు అని అంటున్నారు. సో నాగబాబు రాజకీయ ఆట అలా మొదలవుతుంది అన్న మాట.

రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా ఉపయోగపడేలా పవన్ ఎదగాలి

-నాదెండ్ల మనోహర్

పిఠాపురం,మార్చి 14 (వార్తాప్రభ) : ఎన్ని అవమానాలు ఎదురైనా జనసేన ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడిందని ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురం శివారు చిత్రాడలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. "2019లో జనసేనకు భవిష్యత్తు ఉందా? అనే సందర్భంలోనూ భవన నిర్మాణ కార్మికులకు భరోసా ఇచ్చాం. కష్టమైన ప్రయాణంలో అనేక అవమానాలు ఎదుర్కొన్నాం. మన నాయకుడిని ఇబ్బందులు పెట్టిన రోజులను మనం మర్చిపోలేం. ఆర్థికంగా నిలబడలేని వ్యక్తులు కూడా పార్టీ కోసం నిలబడ్డారు. తనతో పాటు నిలబడిన ప్రతి ఒక్కరినీ పవన్ గౌరవించారు. కష్టపడి యువతరాన్ని నాయకత్వంగా మార్చాలని చెప్పారు. జనసేనలో ప్రస్తుతం 12.32 లక్షల మంది సభ్యులున్నారు. ప్రతిపక్షంలో ఒక విధంగా.. అధికారంలో ఉండగా మరో విధంగా లేము. రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా ఉపయోగపడేలా పవన్ ఎదగాలి. జనసేన ఎప్పుడూ సామాన్యుల పక్షానే నిలబడుతుంది. అధికారులతో కలిసి పేదలకు పథకాలు అందేలా జన సైనికులు కృషి చేయాలి. ప్రశ్నించే స్థాయి నుంచి పరిష్కరించే స్థాయికి మనం ఎదిగాం. పదవులు వచ్చినా రాకున్నా పార్టీకి అండగా ఉందాం. మన పోరాటంలో 463 మంది జనసైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన జనసైనికులకు పవన్ అండగా ఉన్నారు. మన అడుగులు ఎప్పుడూ సామాన్యుడివైపే నడుస్తాయి" అని నాదెండ్ల అన్నారు.

53 కేజీల బంగారం తుప్పు పట్టేస్తుంది.. మా నగలు మాకిచ్చేయండి...

హైదరాబాద్,మార్చి 14 (వార్తాప్రభ) : ఓఎంసీ కేసులో భాగంగా తమ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న 53 కిలోల బంగారు నగలు తుప్పుపట్టిపోతాయంటూ గాలి జనార్దన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నగలతో పాటు తమ వద్ద సీజ్ చేసిన నగదు, రూ.5 కోట్ల విలువైన బాండ్లను విడుదల చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, ఆయన కుమార్తె జి బ్రాహ్మణి, కుమారుడు జి కిరీటిరెడ్డి పిటిషన్లు దాఖలు చేయగా, తెలంగాణ హైకోర్టు వాటిని కొట్టేసింది. బంగారు నగలు తుప్పుపట్టిపోతాయని, విలువ తగ్గుతుందన్న గాలి అభ్యర్థనను తిరస్కరించింది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే వాటిపై హక్కులు తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అక్రమ మైనింగ్ ద్వారా రూ.884.13 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని సీబీఐ కేసు నమోదుచేసి, నేరపూరిత సొమ్ముతో కొన్న నగలపై ఈడీ కూడా హక్కులు కోరుతోందని, అందువల్ల ఈ దశలో సీజ్ చేసిన వాటిని అప్పగించాలని ఉత్తర్వులు ఇవ్వలేమంది. ఓఎంసీ కేసు విచారణ పూర్తయ్యాకే నగలను, సొమ్మును తీసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చంది.

వాలీబాల్ డిప్యూటీ చీఫ్ రిఫరీ డానియేల్ కు సత్కారం

ఇబ్రహీంపట్నం, మార్చి 14 (వార్తాప్రభ) : గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపునకు చెందిన ఇంటర్నేషనల్ వాలీబాల్ రిఫరీ ఎం.డానియేల్ డిప్యూటీ చీఫ్ రిఫరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డానియేల్ ను వ్యాగన్ వర్క్ షాపు సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. వర్క్ షాపు అధికారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ ఎ.చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి హనుమ నాయక్, పీఈ మరియు డబ్ల్యూపీవో బి.శైలా సుధాకర్, రైల్వే ఇన్ స్టిట్యూట్ కమిటీ సభ్యులు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్ 3 ఫలితాల్లో సత్తా చాటిన పురుషులు

- మహిళల్లో టాప్ 10లో ఒక్కరు..టాప్ 50లో నలుగురు
- గ్రూప్ 3 ఫలితాలు విడుదల
- 2,49,567 మంది జనరల్ ర్యాంకులను ప్రకటించిన టిజిపిఎస్ సి
- 1,388 పోస్టులకు 5,36,400 మంది దరఖాస్తులు
- అందులో 2,64,021 మంది మాత్రమే పరీక్షలకు హాజరు
- వారిలో వివిధ కారణాలతో చెల్లుబాటు కాని ఓఎంఆర్ పత్రాలు 18,364

హైదరాబాద్,మార్చి 14 (వార్తాప్రభ) : రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీక నిర్వహించిన పరీక్ష ఫలితాలను శుక్రవారం టిజిపిఎన్ సి విడుదల చేసింది. పరీక్షల్లో పలువును విద్యార్థులు అత్యధిక మార్కులతో సత్తా చాటారు. మొత్తం 450 సూర్యులకు గాను.. అశ్వధికంగా 389.230 మార్కులతో ఓ అభ్యర్థి తొలి ర్యాంకుతో మెరిశాడు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్- 2 ఫలితాల్లో టాపర్ల పేర్లను ప్రకటించకుండా పురుషులు, మహిళల్లో టాపర్లుగా నిలిచిన వారి హాల్ టికెట్ నంబర్లు, వారు సాధించిన మార్కులతో పాటు జనరల్ ర్యాంకింగ్ తో వేర్వేరుగా జాబితాలను విడుదల చేసింది. పురుషుల్లో టాప్ ర్యాంకర్ కు 3:19, 83 మార్కులు రాగా.. మహిళల్లో టాపు (8వ ర్యాంకు) 331383.1.47 మార్కులు వచ్చాయి. మొదటి పది ర్యాంకుల్లో కేవలం ఒక్కరు మాత్రమే మహిళ కాగా మొదటి 60 ర్యాంకుల్లో కేవలం నలుగురు మహిళలే బన్నారు. గ్రూప్ పరీక్షలకు 2,49,387 మందికి సంబంధించిన జనరల్ ర్యాంకులకో పాటే ఫైనల్ కీని టిజిపిఎస్ సి విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం టిజిపిఎస్సీ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో కలిసి ఛైర్మన్ బుర్రా వెంకటేశం గ్రూప్ 3 ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీన గ్రూప్ 1, 11న గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేసిన టీజిపిఎస్సి షెడ్యూల్ ప్రకారం శుక్రవారం గ్రూప్ 2 ఫలితాలు విడుదల చేసింది. 2022 డిసెంబర్లో మొత్తం 1,388 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా 5,36, 4.00 నుంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది నవంబర్ 17.3.8 తేదీల్లో నిర్వహించిన పరీక్షడు మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో వివిధ కారణాల వల్ల 16, 1914 నుంది అభ్యర్థులు ఒ ఎంఆర్ పత్రాలు చెల్లుబాటు కాలేదు. కాగా, 2, 49, 587 మంది జనరల్ ర్యాంకులను టిజిపిఎస్సి ప్రకటించింది. జనవరి 8వ తేదీన గ్రూప్ ప్రాథమిక కీ విడుదల చేసిన కమిషన్ 8 నుంచి 12వ తేదీ వరకు కీపై అభ్యంతరాలను స్వీకరించింది. ఆయా అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన

అనంతరం తుది కీ, జనరల్ ర్యాంకులు విడుదల చేసినట్టు కమిషన్ పేర్కొంది. అభ్యర్థులు బీజీపిఎస్సి అధికారిక వెబ్సైట్లో లాగిన్ ఐడీ ద్వారా ఫలితాలు దూసుకోవచ్చని తెలిపింది. జనరల్ ర్యాంకుల ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వటంతోపాటు ఏజెసైట్ లోనూ వివరాలు పొందుపరుస్తామని కమిషన్ స్పష్టం చేసింది.

అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేశాం: కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

గ్రూప్ 3 ఫలితాల విడుదల సందర్భంగా టిజిపిఎస్ ్సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలోనే ఎలాంటి తప్పులు లేకుండా గ్రూప్స్ ఫలితాలు విడుదల చేశామని అన్నారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని కమిషన్ ఇచ్చిన అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరాడు. ఈసారి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్-1 ఫలితాలు విడుదల చేశామని వెల్లడించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 17న, ఎక్సైజ్ ఆఫీసర్ ఉద్యోగ పరీక్షల తుది ఫలితాలను ఈ నెల 19న ప్రకటించనున్నట్లు తెలిపారు.

కథనరంగంలోకి దూకేందుకు మేము సైతం సిద్ధం

విస్సన్నపేట,మార్చి 14 (వార్తాప్రభ) : స్థానిక మండలానికి చెందిన ముంగా జయరాజుకు అధికార ప్రతినిధి పల్లెపా0 లక్ష్మయ్యకు జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన రెడ్డి నియామకం చేయటం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. 40% ఓటు బ్యాంకు తమ పార్టీకి ఉన్నదని అసెంబ్లీ సీట్లు 11 కావచ్చు గాని ప్రజల అభిమానం సింగల్ గా పోటీ చేసిన జగనన్నకే ఎక్కువగా ఉన్నదని ఇది కూటమి ప్రభుత్వం గుర్తించాలన్నారు. తొలి సంతకం పెట్టిన డీఎస్సీ కనిపించడం లేదని సూపర్ సిక్స్ గురించి మాట్లాడిన వారు లేరని ప్రజల పక్షాన ఉంటూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వారు అన్నారు. తమకు గుర్తింపునిస్తూ తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్ తిరువూరు నియోజకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు సహాయ సహకారాలతో అందర్నీ కలుపుకొని ప్రజా సేవలో ముందు అడుగు వేస్తామన్నారు.

నూతన వైసిపి మండలాధ్యక్షుడు ఓలేటికి ఘన సన్మానం

విస్సన్నపేట,మార్చి 14 (వార్తాప్రభ) : స్థానిక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు ఓలేటి దుర్గారావుకు ఎంపీపీ పీఎం వనజాక్షి రాజేష్ దంపతులు పూలదండ వేసి పట్టుశాలవాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు . నరసాపురం వైసీపీ నాయకులు కాసర్ల చెన్నారెడ్డి, కాపు నాయకులు అనసాని లాలయ్య, తాత కుంట్ల గౌరం పాలెం ముస్లిం సోదరులు కాలీషా మిత్ర బృందం, విస్సన్నపేట మండల కేంద్రంలోని మసీదు కమిటీ అధ్యక్షులు బాజీ బాబా, షరీఫ్, కరిముల్లా, జానీ రహంతుల్లా తదితరులు వేరువేరుగా అభినందనలు తెలియజేసి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎంఎస్ ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సరస్వతి పూజా

కాకినాడ,మార్చి 14 (వార్తాప్రభ) : స్థానిక జగన్నాధపురం ఎం.ఎస్.ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు 10వ తరగతి విద్యార్థులకు సరస్వతి పూజను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.ఎస్.ఎన్. చారిటీస్ కార్యనిర్వహణాధికారి అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం లో ఉన్నత స్థాయికి ఎదగలాన్నరు. మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎమ్.ఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షలలో విజయం సాధించేందుకు కృషి చెయ్యాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులకు ఎమ్ ఎస్ ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ కుమరి సౌజన్యంతో పరీక్ష సామగ్రి ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో లో ఎమ్ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషా రాణి, ఎమ్ ఎస్ ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ కుమారి, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, పి.ధనలక్ష్మి, సి.హెచ్ శ్రీహరిరావు నాయుడు, జి.మేరి విజయకుమారి,హెూతా చంద్రమౌళి, కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,వేద విద్యార్థులు పాల్గొన్నారు.

అహింసా శాఖాహార ర్యాలీ

నందిగామ,మార్చి 14 (వార్తాప్రభ) : పట్టణం లోని కాకుళలయ్య వీధిలో పిరమిడ్ మందిరం రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.శుక్రవారం మండలం పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో "అహింస పరమ ధర్మః, శాఖాహారం అమృతహారం" అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఆరోగ్యమే మహాభాగ్యం అని పిరమిడ్ వ్యవస్థాపకుడు పత్రీజ సందేశమైనఆరోగ్యమే ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస చేయటం వల్ల పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని అవగాహన ర్యాలీలో తెలిపారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యూవల్ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

కాకినాడ, మార్చి 14 (వార్తాప్రభ) : విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యపై కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ జిల్లాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కేంద్ర కార్మిక సంఘాలు సిఐటియు, ఐఎన్టియుసి, ఐఎఫ్టియు, ఏఐసీసీటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి, ఐఎన్టియుసి నాయకులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు నాయకులు దుర్గారావు, ఏఐసీసీటియు నాయకులు గొడుగు సత్యనారాయణలు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేశామని కేంద్ర ప్రభుత్వం పైకి ప్రకటనలు ఇచ్చినా దొడ్డి దారిన ప్రైవేటీకరణ పనులను వేగవంతం చేసిందని ఇది చాలా దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్కి ప్యాకేజీ ప్రకటించిందని ఆ ప్రకటించిన ప్యాకేజీ నుంచి అప్పులు తీర్చడానికి సొమ్మును ఉపయోగిస్తుందని కార్మికుల జీతాలు చెల్లించడానికి ఈ సొమ్మును ఉపయోగించాలన్నారు. ఏళ్ల తరబడి విశాఖ స్టీల్ ప్లాంట్కి సొంత గనులు కేటాయించాలని కార్మికులు ప్రజా సంఘాలు మేధావులు అడుగుతున్నా గాని కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్కు సొంత గనులు కేటాయించకుండా కాలయాపన చేస్తుందని సొంత గనుల కేటాయించి ఉంటే విశాఖ స్టీల్ ప్లాంట్ మరింత లాభాలతో ముందుకు వెళుతుందని తెలియజేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్లో పనిచేస్తున్న కార్మికులను ఈ మధ్యకాలంలో 900 మందిని నిలుపుదల చేసినట్టు వార్తలు వస్తున్నావని తక్షణమే నిలుపుదల చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని సంవత్సరాల తరబడి కార్మికుల పోరాడుతున్న ఈ పోరాటాన్ని పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం చాలా మొండిగా వ్యవహరిస్తుందని ఇది తగదన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో నోరు మెదపాలని సొంత గనులు కేటాయింపు విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి గనులు కేటాయించే విధంగా కృషి చేయాలన్నారు. అవసరమైతే కార్మిక సంఘాలను, అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఉమ్మడి కార్యాచరణతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని దానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అను నినాదంతో ఎందరో ప్రాణ త్యాగాల వల్ల వచ్చిన నవరత్న హెూదా కలిగిన ఈ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కార్మిక సంఘాలు వెనక్కి తగ్గేది లేదని ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమళ్ళ పద్మ, సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, ఐఎఫ్టియు నాయకులు నరసింహ, ఎస్ సత్తిబాబు, ఆర్ రాఘవ, ఐఎన్టీయూసీ నాయకులు, వివి రమణ, పి సాయి, కే రాజబాబు, ఏఐసిసిటియు నాయకులు నరసరాజు, మెస్ యూనియన్ నాయకులు వీరబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి..

- 1250 రోజులకు చేరిన జీజీహెచ్ ఆప్కోస్ ఉద్యోగుల నిరసన

కాకినాడ,మార్చి 14 (వార్తాప్రభ) : కాకినాడ ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో 2018 అక్టోబరులో డిఎంఈ ఆర్డరు జీవో నెం 151 ప్రకారం చేరి 2020 ఆప్కోస్ లో కలపబడి 2021 సెప్టెంబరులో అక్రమంగా తొలగించబడిన వివిధ జిల్లాల బోధన ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత 1200 రోజుల నుండి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వద్ద నిరసన ధర్నా నిర్వహిస్తున్నారు.ఈ మేరకు పాత్రికేయులతో మాట్లాడుతూ తామంతా 2018 నుండి 2021 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో ఎంఎన్ఓ,ఎఫ్ఎన్ఓ, టైలర్,ఎలక్ట్రిషన్,లిఫ్ట్ ఆపరేటరుగా విధులు నిర్వహిచామని డిఎంఈ ఫోన్ ఆదేశాల మేరకు మమ్ములను కక్షపూరితంగా ఏవిధమైన సమాచారం ఇవ్వకుండా తొలగించడం జరిగిందని,హైకోర్టును ఆశ్రయించగా రిట్ పిటిషన్ వేసి ఉద్యోగాలను తొలగించవద్దని స్టే ఆర్డరు ఇచ్చినా ఆర్డరును సైతం లెక్క చేయకుండా ప్రభుత్వ ఉన్నత అధికారులు తమపై చిన్న చూపు చుస్తున్నారని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై గత ప్రభుత్వంలో కాకినాడ జిల్లా కలెక్టరు వారిని , ప్రజా ప్రతినిధులను పలుమార్లు కలిసినా ఏవిధమైన ప్రయోజనం లేదన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో కూటమి ప్రభుత్వంలో నైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశించి తామంతా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)ను ,జిల్లా కలెక్టరు వారిని కలిసి వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. గత ప్రభుత్వం తమను కక్షపూరితంగా తొలగించి హైకోర్టు ఆర్డర్లను పక్కనపెట్టి తమపై కక్ష తీర్చుకున్నారన్నారని ఈ సందర్భంగా తెలిపారు. 1200 రోజులుగా నిరసన తెలుపుతున్న తమకు కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందే నమ్మకంతో ఉన్నామన్నారు.దీనిపై కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ నిరసన ధర్నాలో కాకినాడ ప్రభుత్వ ఆప్కోస్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

17వతేదీన వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా: వికాస పిడి లచ్చారావు

కాకినాడ,మార్చి 14 (వార్తాప్రభ) : కాకినాడ కలెక్టరు కార్యాలయంలో వికాస నందు మెగా జాబ్ మేళాలో హాల్మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్ లి? కంపెనీలో జూనియర్ అకౌంటెంట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బి.కామ్, ఎం. కామ్, ఎం.బిఎ, (సి.ఎ ఇంటర్) ఉత్తీర్ణులైన (ఫ్రెషర్స్ ,ఎక్స్ పీరియన్స్ వారు,టాలీ, అకౌంటింగ్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో అవగాహన ఉన్న పురుష అభ్యర్థులు అర్హులు, మెనెన్డ్ ఫార్మా లిమిటెడ్లో మెడికల్ రిప్రెజంటేటివ్, నిట్ హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకుల్లో అసిస్టెంట్ మేనేజర్, ఇండో ఎం.ఐ.ఎం, హెూండాయ్ మోటీస్, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అలాగే డి.యు.జి.కె.వై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐ.టి.ఐ.డిప్లొమో, డిగ్రీ,బి.టెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు.వీరికి నెలకు రూ.13,000 నుండి రూ.35,000 వరకు జీతంఇన్సెంటివ్స్, భోజనం,వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 17వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గంఎఎలకు సర్టిఫికెట్స్ జెరాక్స్ తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 7799376333, www.vikasajobs.com సంప్రదించవలెను. తెలియజేశారు ఎవరిని నమ్మి ఎటువంటి డబ్బులు ఇవ్వవలసిందిగా ఉచితంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఎవరిని నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

నేడు "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" పై అవగాహన సదస్సు

నందిగామ,మార్చి 14 (వార్తాప్రభ) : నేడు స్థానిక జగజ్జీవన్ రామ్ భవనం నందు వ్యాపారస్తులు, హెూటల్ యజమానులు, కర్రీస్ పాయింట్ మరియు టీ స్టాల్స్ వ్యాపారములు నిర్వహించు వారితో "సింగిల్ యూజ్ ప్లాస్టిక్" పై అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం వారి ఉత్తర్వులు మేరకు ప్రతినెల మూడవ శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మరియు పట్టణంలోని ప్రతి ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకొనుటకై "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.120 మైక్రాన్ ప్లాస్టిక్ కన్నా తక్కువ ప్లాస్టిక్ వాడటం చట్టరీత్యా నేరమని కమిషనర్ తెలిపారు.

బద్వేలలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం కూల్చివేయడం దారుణం-ఏపి రెడ్డి సంఘం

మైలవరం,మార్చి 14 (వార్తాప్రభ) : కడప జిల్లా బద్వేలలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం కూల్చివేయడం దారుణమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బిక్క నరసింహారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి,సహాయ కార్యదర్శి అన్నం సుబ్బారెడ్డి లు శనివారం ప్రకటనలో తెలిపారు.రెడ్డి అన్న పదం ఆంధ్రరాష్ట్రంలో ఎక్కడ కనబడకుండా చేసేందుకు పేదలకు అన్నదానం చేస్తున్న ఆశ్రమాన్ని కూల్చడం హేయమైన చర్యగా ప్రజలు విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతం అనే కారణంతో నిత్య అన్నదాన ఆశ్రమాన్ని కూల్చివేయడం సామాజిక వర్గం నేపథ్యంలో జరిగిందని వారు విమర్శించారు. ఈ హేయమైన చర్యను ఖండిస్తూ మార్చి 16 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు క్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నేతలు తెలిపారు.రాజకీయాలకు, కులాలకు అతీతంగా కాశి రెడ్డి నాయన ఆశ్రమాన్ని కాపాడుకుందామని, నిత్య అన్నదానాన్ని కొనసాగిద్దామనే నినాదంతో వేలాదిగా అందరూ తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ప్రకటనలో పిలుపునిచ్చింది.పూర్తి వివరాలకు 9885706153, 9502447878 సంప్రదించాలని కోరారు.

తిరుపతమ్మ చిన్న తిరునాళ్ళ ప్రారంభం

పెనుగంచిప్రోలు, మార్చి 14 (వార్తాప్రభ) : తిరుపతమ్మ అమ్మ వారి చిన్న తిరునాళ్ళశుక్రవారం నుండి వైభవంగా ప్రారంభమైంది.అమ్మ వారి ఆలయ కార్యనిర్వాహణాధి కారి డిప్యూటీ కమిషనర్ కిశోర్ కుమార్, చైర్మన్ జంగాల. శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన గోపి అమ్మ వారి కీ ప్రత్యేక పూజలు చేసి, అ ఖండ జ్యోతి స్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించు కున్నారు. భక్తులకు ఎటువంటి అసౌ కర్యాలు కలుగకుండా ఆలయ ఏ.ఈ.ఓ. లు ఉమాపతి, తిరుమలేశ్వర రావు, లు ప్రభుత్వ శాఖల అధికారుల సహకారం తో తగిన ఏర్పాట్లు చేశారు, తహసీల్దార్ శాంతి లక్ష్మి, అధికారులను సమన్వం చేస్తూ తిరునాళ్ళ ఏర్పాట్లను పర్యవేక్షణ చేస్తున్నారు. సానిటేషన్ విషయం లో ఎంపిడిఓ. జి శ్రీను, సర్పంచ్ వేల్పుల. పద్మకుమారి, పంచాయి తి కార్యదర్శి జి. శామ్ కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పటిష్ట బందోబస్త్ : తిరుపతమ్మ చిన్న తిరుణాళ్లకు నందిగామ ఏసీపీ, తిలక్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీ. ఐ. వెంకటేశ్వర రావు పర్యవేక్షణ లో పటిష్ట బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. తిరుణాళ్లకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబందులు రాకుండా స్థానిక ఎస్. ఐ. అర్జున్ పర్యవేక్షణ చేస్తున్నారు.

శానిటేషన్ పనులు : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ళ సందర్భంగా సర్పంచ్ వేల్పుల. పద్మ కుమారి, కార్యదర్శి, శామ్ కుమార్, ఆలయ ప్రాంగణంలో పార్య శు ద్య నివారణలో భాగంగా శాని ట్రై జర్, బ్లీసింగ్, చెలించారు. భక్తుల వినోదం కోసం ఏర్పాట్లు చేసిన జయంతి విల్, బ్రెక్ డాన్స్, పరికరాలు పరిశీలించి న్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఈ రమా, ఏ ఈ ఓ లు ఉమాపతి, తిరుమలేశ్వర రావు, ఎ ఇ లు రాజు, అరవింద్, సూపర్ డెంట్. శ్రీనివాస్, టీడీపీ నాయకులు చుంచు రమేష్ బాబు,కె.సతీష్ కుమార్, మాదినేని. వెంకట్రావు, అజాద్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నందిగామ,మార్చి 14 (వార్తాప్రభ) : సామాన్య ప్రజలకు బాసటగా ఉద్భవించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను స్థానిక పాత బస్టాండ్లో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ అన్ని తానై నిలిచి పార్టీని విజయబావుటా వైపు నడిపించి ఇటు రాష్ట్రంలో గాని అటు కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి అత్యంత కీలకపాత్ర పోషించారని ఆ పార్టీ నాయకుడు పూజారి రాజేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ తాటి వెంకటకృష్ణ, కామిశెట్టి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి వరుణ్,నిమ్మల రాజశేఖర్, షేక్ అజారుద్దీన్,రామ్ రెడ్డి వీరబాబు, పాములపాటి సురేష్ వీర మహిళలు శ్రీ లక్ష్మీ యాదవ్ ఆవుల పార్వతి, తాటి ఫణీంద్ర సింగంశెట్టి శ్రీనివాస్ జాబిశెట్టి సతీష్, మధుసూదన్ రావు, కోటేశ్వరరావు, వెంకటేష్, రఫీ, రవి, నరేంద్ర, సిరివెళ్ల వెంకటకృష్ణ, పలువురు జన సైనికులు హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.అనంతరం పిఠాపురంలో జరగబోతున్న ఆవిర్భావ సభకు తరలి వెళ్లారు.

53.30 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

- రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి
- పేద వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ,మార్చి 14 (వార్తాప్రభ) : రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం తమదని స్థానిక ఎమ్మెల్యే,ఏపీ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.శుక్రవారం కాకాని నగర్ లోని ఎంఎల్ఏ కార్యాలయంలో నియోజకవర్గంలోని 37 మందికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.53 లక్షల 30 వేల 633 రూపాయల చెక్కులను ఎమ్మె ల్యే అందజేశారు.వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వైద్య పరంగా అధికంగా ఖర్చులు పెట్టుకొనే వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి మరియు కూటమి నేతలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ అర్చకులకు 40 వేల వస్త్రాలు బహుకరణ

పెనుగంచిప్రోలు,మార్చి 14 (వార్తాప్రభ) : పెనుగంచి ప్రోలు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లోని అర్చకులకు తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం జిల్లా, మినుగురు గ్రామానికి చెందిన గురుజాల గోపి, ఏర్పాటుచేసిన సుమారు 40 వేలు రూపాయలు విలువ గల వస్త్రాలను ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన, గోపి ఆధ్వర్యంలో మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవ రావు చేతుల మీదుగా శుక్రవారం అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహనఅధికారి బి హెచ్ వి ఎస్ ఎన్ కిషోర్ కుమార్, నూతలపాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు,

గంగానమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అన్నదానం

మచిలీపట్నం, మార్చి 14 (వార్తాప్రభ) : మచిలీపట్నం రేవతి సెంటర్ లో వేంచేసి ఉన్న శ్రీ గంగానమ్మ తల్లి దేవాలయంలో ఈరోజు పౌర్ణమి లక్ష్మీదేవి పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు పసుపు, కుంకుమ, గంధము, చెరుకు రసము, విభూది, పంచదార, ఆవు నెయ్యి, తేనే, వివిధ రకాల పండ్ల రసాలు, పన్నీరు మొదలగు ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు తదుపరి వివిధ రకాల పువ్వుల దండలతో, నిమ్మకాయల దండలతో, అనేక ఆభరణాలు తోఅలంకరణలు నిర్వహించారు. కంతంరాజు భాస్కర్ శర్మ వేదమంత్రాలు అర్చకత్వంలో కొర్రపాటి శ్రీనివాస్, భక్తురాలు విజయలక్ష్మి అమ్మవారికి తమదైన రీతిలో అలంకరించారు. ఆలయ ధర్మకర్త అయినాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు సహకారంతో హాజరై అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్న సమారాధనలో పాల్గొన్నారు.

పండగ పూట కార్మికులను పస్తులలో ఉంచుతారా

సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గ దినకర్

ఆసిఫాబాద్ మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి). గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్లకు వేతనాలు చెల్లించాలని ఆశ్రమ పాఠశాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు నేడు మూడవ రోజు సమ్మె శిబిరాన్ని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం.దినకర్ సందర్శించి కార్మికులకు సీపీఎం పార్టీ ఎల్లప్పుడూ అండ దండగ ఉంటుందని ధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ 7 నెలల వేతనాలు రాకుంటే కార్మికులు వారి కుటుంబాలు ఎలా బ్రతకాలని అన్నారు హోలీ పండుగ రోజు కూడా కార్మికులు సమ్మెలో ఉన్నారంటే జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని అన్నారు .కార్మికుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలనీ ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని,ఐదు సంవత్సరాల సర్వీసు ఉన్నా వారిని పర్మినెంట్ చేయాలని,పని చేస్తున్న కార్మిక కుటుంబాల వారసులకు ఉద్యాగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రజలకు ,పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి: జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. పోలీస్ అధికారులు, సిబ్బంది తో ఉత్సహంగా, సంతోషంగా హోలీ వేడుకలు నిర్వహించారు.. హోలీ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంగుల పండుగ హోలీ అందరికీ సంతోషం కలగాలని, మీ జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, వెలుగులను నింపాలని ఎస్పీ ఆకాంక్షించారు తెలిపారు.ఈ వేడుకల్లో అదనపు ఎస్పి భీమ్ రావు, డీఎస్పీలు రఘు చందర్, రాములు, సిఐలు ఆరిఫ్ అలీ ఖాన్, రాం నరసింహారెడ్డి వేణుగోపాల్, సురేష్, కృష్ణారెడ్డి, రవి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, మరియు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిజేపీ శ్రేణులతో కలిసి హోలీ పండుగ జరుపుకున్న ఎమ్మెల్యే

అదిలాబాద్ మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి. హోలీ పండగ ప్రతి ఒక్కరి జీవితంలో వారి జీవితమంతా రంగులమయంగా ఉండాలని, ఎలాంటి కష్టాలు లేకుండా భగవంతుడు ప్రతి ఒక్కరిని సంతోషంగా ఉంచాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆకాంక్షించారు.హోలీ పండుగ వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణులతో పాటు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా హోలీ పాటలపై పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషాని,ఎస్పీ అఖిల్ మహాజన్ ని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు..

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అదిలాబాద్ మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి. హోలీ పండగను పురస్కరించుకొని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచ శ్రీకాంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపి రంగులు పూసుకుని కాంగ్రెస్ శ్రేణులు,యువజన కాంగ్రెస్ నాయకులు శ్రేయోభిలాషులు.. నాయకులు,కార్యకర్తలు, అనుబంధ సంఘాలు,కాంగ్రెస్ పార్టీ అభిమా నులు,ప్రజలందరు, సహజ సిద్ధమైన రంగులతో హోలీ పండగ ఆనందంగా జరుపుకోవాలి,ఈ హోలీ అందరి జీవితాల్లోకొత్తరంగులు నింపాలని,ప్రతిఒక్కరుసుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నని అయన తెలిపారు..

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన సొసైటీ సభ్యులు

అదిలాబాద్ మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిది హోలీ పండగను పురస్కరించుకొని ఆదిత్య ఖండెప్కర్ సొసైటీ సభ్యులు, అధ్యక్షుడు ఆదిత్య ఖండెప్కర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపి రంగులు పూసుకునిశ్రేయోభిలాషులు,అనుబంధ సంఘాలు,అభిమానులు,ప్రజలందరు,సహజ సిద్ధమైన రంగులతో హోలీ పండగ ఆనందంగా జరుపుకోవాలి,ఈ హోలీ అందరి జీవితాల్లోకొత్తరంగులు నింపాలని,ప్రతిఒక్కరుసుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నని అయన తెలిపారు.ఈ సంబరాల్లో ఆదిత్య ఖండేప్కర్ జన్నవార్ గజనంద్,కుమ్మరిపెల్లి సాయితేజ, గుండావార్ సాయికృష్ణ,సందీప్ శర్మ,రాకేష్ రెడ్డి,మనోజ్ తదితరులు ఉన్నారు.

సాబీర్ పాషా కు హోలీ శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషాకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన సుజాతనగర్ మండల సిపిఐ నాయకులు అనంతరం హోలీ వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు రంగులతో ఆడుకుంటూ ఆనందించే ఏకైక పండుగ హోలీ అని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు హోలీ పండుగ జరుపుకుంటాం అన్నారు హోలీ పండుగను హోలికా పూర్ణిమ అని కూడా అంటారని దేశవ్యాప్తంగా హోలీ సందడి కొత్తగూడెంలో ఎక్కడ చూసినా అదే రంగులు కనిపిస్తున్నాయని చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు పూసుకుని ఎంతో ఆనందంగా పండుగ జరుపుకుంటున్నారు జీవితాల్లో ఆనందాన్ని నింపడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం అని పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రసాయన రంగులతో ఆడకుండా సేంద్రియ రంగులతో హోలీ జరుపుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు , కోమటిపల్లి తాజా మాజీ ఎంపీటీసీ మూడు గణేష్ , భూక్య శ్రీను, కోమటిపల్లి గ్రామపంచాయతి సిపిఐ యూత్ నాయకులు భూక్య రాజేష్ రాథోడ్ ,మూడ్ ప్రశాంత్ భూక్య రవి భూక్య మోతిలాల్ , భూక్య ప్రశాంత్ , లావుడియా జంపన్న భూక్య గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళన

● వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు పార్టీ శ్రేణులు ఆందోళన ● అసెంబ్లిని అడ్డాగా చేసుకుని కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతుంది-బీఆర్ఎస్ ● సమరోత్సాహంతో కదిలి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బీఆర్ఎస్ సైన్యానికి ధన్యవాదాలు తెలిపిన కేటీఆర్

హైదరాబాద్, మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని శాసనసభ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదిలాబాద్ టూ ఆలంపూర్ తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను కాలబెట్టారు. ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నినదించారు. జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం అన్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకే సిఎం రేవంత్ రెడ్డి సస్పెన్షన్లను ఆయుధంగా మలుచుకున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు ప్రతిరూపమైన అసెంబ్లీని తన నియంతృత్వ పోకడలతో రేవంత్ రెడ్డి భ్రష్టుపట్టించారని విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా చెప్పుకోవడానికి ఒక్క మంచి పని కూడా చెయ్యని రేవంత్ రెడ్డి, తన చేతకానితనం బయటపడొద్దనే అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకులపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కితే ప్రజా కోర్టులో తేల్చుకుంటామన్నారు. పార్టీ పిలుపు మేరకు తెలంగాణ గ్రామ గ్రామాన సమరోత్సాహంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాన్ని ఎండగట్టిన కార్యకర్తలు, నాయకులకు కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను, హామీల అమలు మోసాన్ని ఇదే స్ఫూర్తితో ఎప్పటికప్పుడు ఎండగడదామని పిలుపునిచ్చారు.

పాలన చేతగాక బీఆర్ఎస్ గొంతు నొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ - కేటీఆర్

హైదరాబాద్, మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. జగదీష్ రెడ్డి సస్పెండ్ కు వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు నిచ్చారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు చేసిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలపై కేటీఆర్ స్పందించారు. అసెంబ్లీ సాక్షిగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఒక్క పిలుపునిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో కదంతొక్కిన గులాబీ శ్రేణులకు ధన్యవాదాలన్నారు. వాళ కార్యక్రేత్రంలో మీరు చూపించిన సమరోత్సాహం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వానికి కూడా కొండంత స్ఫూర్తినిచ్చిందని తెలియజేశారు. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎలా ప్రాణాలకు తెగించి పోరాడారో, ఇవాళ ప్రధాన ప్రతిపక్షంగా కూడా తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంతకు రెట్టింపు తెగువతో మీరు పిడికిలి బిగించిన తీరు అభినందనీయమని కొనియాడారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సస్పెండ్ చేసి సభ నుంచి పారిపోయిన కాంగ్రెస్ సర్కారు, ప్రజాక్షేత్రంలో నాలుగు కోట్ల ప్రజల నుంచి మాత్రం తప్పించుకోలేదని మండిపడ్డారు. పరిపాలన చేతకేక శాసనసభలో బీఆర్ఎస్ గొంతునొక్కాలని చూస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలపక్షాన తప్పకుండా మూడుచెరువుల నీళ్లు తాగిస్తామని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలతో ఆగంచేసి, 420 హామీలతో మభ్యపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా దిశగా నడిపిస్తున్న కాంగ్రెస్ సర్కారు పాపం పండిందన్నారు. బీఆర్ఎస్ ఇవాళ పూరించిన జంగ్ సైరన్ ఆరంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో ఈ మోసకారి ప్రభుత్వం మెడలు వంచేదాకా ఉద్యమపంథాను కొనసాగిద్దామన్నారు. ప్రాణాలకు తెగించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు ఇలాగే సంఘటితశక్తిగా ముందుకు సాగుదామని కేటీఆర్ పేర్కొన్నారు.

కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు స్వయంగా వెళ్లి హోలీ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి. శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో, ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ జిల్లా పోలీసులతో కలిసి హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుండి సాయుధ పోలీసులతో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బంగ్లాకు స్వయంగా వెళ్లి కలెక్టర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలీస్ అధికారులకు సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచారు. అనంతరం ఎస్పి కార్యాలయానికి చేరుకొని ఎస్పీ పోలీస్ సిబ్బందితో కలిసి ఆనందోత్సవాలతో నృత్యాలు చేస్తూ, పోడి రంగులు చల్లుతూ సందడి చేశారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీసులకు హోలీ పంగడ శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపి రంగుల మాయం చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. మరియు ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సంబరాల్లో ఆర్ ఐ నరసింహ, శివ శంకర్, ఎస్ఐ లు నరేష్, రమేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై తెలంగాణ వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు

ఆసిఫాబాద్ మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) అసెంబ్లీ నుండి మాజీ మంత్రి, ఎమ్మెల్యేశ్రీ జగదీశ్వర్ రెడ్డి ని సస్పెండ్ చేయడం అంటే ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నమే.రాష్ట్ర ప్రజలు, రైతులు, వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన జగదీశ్ రెడ్డిని సభ నుండి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ.లక్ష్మీ పిలుపు మేరకు శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అని నినదించారు ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

మిర్యాల ప్రీతం నివాసం లో ఘనంగా హోలీ వేడుకలు

శేరిలింగంపల్లి,మార్చి 14 (వార్తాప్రభ): చందానగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మరియు మిర్యాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిర్యాల ప్రీతం తన నివాసానికి వచ్చిన ద్వారకా మహిళలు తో కలిసి హోలీ పండుగను జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారికి చిరు కానుకలు అందించి హోలీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

హోలీ వేడుకల్లో న్యూజిలాండ్ ప్రధాని

వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ హోలీ. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా హోలీని జరుపుకుంటున్నారు. ఈక్రమంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లుక్సాఎసైతం హోలీ జరుపుకున్నారు. అక్లాండ్‌లోని ఇస్కాన్ ఆలయంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రజలతో కలిసి హోలీ ఆడారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.ఇదిలా ఉండగా.. మరికొన్ని రోజుల్లో లుక్సాన్ భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని హోదాలో ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. తాను భారతదేశానికి పెద్ద అభిమానినని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. మార్చి 16 నుంచి 20 వరకు ఈ పర్యటన ఉంటుంది. ఈ సందర్భంగా వాణిజ్యం, రక్షణ సహకారం, ప్రజల మధ్య సంబంధాల విస్తరణ వంటి కీలక విషయాలపై ప్రధాని మోదీతో చర్చించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సైతం ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. ఇక, ఆయన ముంబయిని కూడా సందర్శించనున్నట్లు తెలుస్తోంది. లుక్సాన్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపరుస్తుందని భారత విదేశాంగ శాఖ పేర్కొంది.

ట్రంప్ టారిఫ్‌లపై ధీటుగా స్పందిస్తాం - ఈయూ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో అనేక దేశాలు పునరాలోచనలో పడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా వీటిపై యూరోపియన్ యూనియన్ కూడా తీవ్రంగా స్పందించింది. ట్రంప్ ప్రతిపాదించిన ప్రతీకార టారిఫ్‌లలో సమర్థించుకునే అంశాలేమీ కనిపించలేదని, వీటిపై త్వరలోనే దీటుగా స్పందిస్తామని తెలిపింది. ట్రంప్ విధానం తప్పుడు దిశలో వెళ్తోందని స్పష్టం చేసింది. "దిగుమతులపై ప్రపంచంలో అతి తక్కువ సుంకాలను ఈయూ విధిస్తోంది. 70 శాతం దిగుమతులపై సుంకాలే లేవు. ఎగుమతులపై అమెరికా సుంకాలను పెంచేందుకు ఎటువంటి సమర్థనీయ అంశాలు కనిపించడం లేదు. స్వేచ్ఛాయుత వాణిజ్యానికి అడ్డంకిగా మారే ఈ చర్యలపై ఈయూ త్వరలోనే దీటుగా స్పందిస్తుంది" అని ఈయూ కమిషన్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ట్రంప్ ప్రణాళికలు సరైన దిశలో వెళ్తున్నట్లు కనిపించడం లేదని, ఆర్థిక అనిశ్చితిని పెంచడంతోపాటు ప్రపంచ మార్కెట్ల సామర్థ్యాన్ని ఇవి దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.అమెరికా దిగుమతులపై ఛార్జీలు విధించే అన్ని దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ప్రణాళికపై ఆయన సంతకం చేశారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ఈయూ ఈ విధంగా స్పందించింది. యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాల వాణిజ్య విధానాలను యూరోపియన్ కమిషన్ సమన్వయం చేస్తుంది.

ఎడిటోరియల్

లెఫ్ట్ టూ రైట్ : దటీజ్ పవన్ చరిష్మా

పవన్ కళ్యాణ్ పొలిటికల్ ఫిలాసఫీ ఏమిటి అన్న ప్రశ్న ఎవరైనా వేసుకుంటే జవాబు వారికి అంత సులువుగా దొరకదు. ఎందుకంటే ఆయన చెగువేరా నుంచి సనాతన ధర్మం దాకా తన రాజకీయ ప్రస్థానంలో సాగుతూ వచ్చారు. ఆయన లెఫ్టిస్ట్ ఫిల్సాసఫీ టచ్ ఉన్న వారుగా 2014 మార్చి 14న ఏర్పాటు చేసిన జనసేన సభలోని ప్రసంగం చూస్తే కనిపిస్తుంది. కానీ 2024 ఎన్నికల తరువాత ఆయన పూర్తిగా సనాతన వాదిగా మారిపోయారు .అయితే ఇవేమీ ఆయన నాయకత్వంలోని జనసేనను ఇబ్బంది పెట్టలేదు. ఆ పార్టీ అంతా పవన్ చరిష్మాతోనే ముందుకు సక్సెస్ ఫుల్ గా సాగుతోంది. జనసేనకు 2025 మార్చి 14తో అచ్చంగా 11 ఏళ్ళు నిండిపోయిన నేపథ్యంలో జనసేన ఈ రాజకీయ ప్రస్థానంలో పడిన అడుగులు పవన్ చేసిన రాజకీయాల గురించి చూస్తే ఆసక్తిగానే ఉంటుంది.కాంగ్రెస్ అరాచకాలను ఎదిరించేందుకు పార్టీ అంటూ 2014లో నినదించిన పవన్ దానికి కట్టుబడి 2014 ఎన్నికల్లో ఏపీలో టీడీపీ బీజేపీలకు మద్దతు ప్రకటించారు. తొలి ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు కూడా. అయితే ఈ రెండు పార్టీలను ఆయన మూడేళ్ళ తరువాత విభేదించడం మొదలెట్టారు. ప్రత్యేక హోదా ఏపీకి ఇవ్వలేదని బీజేపీని నిందించారు. అలాగే ఏపీలో అభివృద్ధి పాలన లేదని టీడీపీని నేరుగా టార్గెట్ చేసారు.అలా తాను విపక్ష పాత్రలోకి మారి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ వామపక్షాలతో కలసి ఎన్నికల్లో పోటీకి దిగారు. మొత్తం 134 సీట్లలో ఈ మూడు పార్టీలూ పోటీ చేస్తే గెలిచింది ఒకే ఒక్క సీటు. అది రాజోలులో రాపాక ప్రసాదరావు గెలిచారు. పవన్ పోటీకి దిగిన భీమవరం గాజువాకలలో ఓటమిని చవి చూశారు.దాంతో జనసేన పని అయిపోయింది అని అంతా అనుకున్నారు. ఎందుకంటే ప్రాంతీయ పార్టీలకు తొలి పరాజయం కోలుకోలేని దెబ్బ గానే ఉంటుంది. కానీ పవన్ పడి లేచిన కడలి తరంగం మాదిరిగా వైసీపీ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవడం మొదలెట్టారు. ఇసుక ఉద్యమాన్ని ఆయన చేపట్టి భవన నిర్మాణ కార్మికులు ఇసుక కోరత కారణంగా ఉపాధి పొందడం లేదని విమర్శిస్తూ విశాఖలో లాంగ్ మార్చ్ ని నిర్వహించారు. దానికి టీడీపీ నుంచి మద్దతు కూడా లభించింది. ఇది జరిగిన తర్వాత బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారు. అలా బీజేపీతో కలసి పవన్ సాగించిన రాజకీయ పోరాటంలో ఆయనకు జాతీయ పార్టీ అండ ఉందన్న భావన అయితే కలిగింది.కానీ పవన్ జనసేన బీజేపీతో ఏపీలో ఎంతవరకూ ప్రభావం చూపిస్తుంది అన్న చర్చ కూడా సాగింది. అదే సమయంలో తెలుగుదేశం పట్ల సాఫ్ట్ కార్నర్ తో పవన్ ఉండడంతో వైసీపీ మూడు పార్టీలూ ఒక్కటే అని ముందే కూటమిని కలిపేస్తూ విమర్శలు చేసింది. ఇది జనసేనకే ఎక్కువ మేలు చేసింది. జనసేనాని కూడా తన మనసులోని ఉన్న దానిని ఎక్కడా దాచుకోలేదు. ఆయన 2022 జనసేన ఆవిర్భావ సభలో ఏపీలోని అన్ని పార్టీలు వైసీపీకి వ్యతిరేకంగా కలవాలని పిలుపు ఇవ్వడం వెనక ఉన్న ఉద్దేశ్యమూ అదే అని అంటారు.ఇక 2023లో జనసేనకు ఒక పొలిటికల్ టర్నింగ్ పాయింట్ గా బాబు అరెస్ట్ మారింది. బాబుని అరెస్ట్ చేసిన క్రమంలో రాజమండ్రి జైలుకు వెళ్ళి ములాఖత్ అయిన పవన్ జైలు బయటే టీడీపీతో పొత్తు ప్రకటన చేసి సంచలనం సృష్టించారు. అప్పటికి బీజేపీతో పవన్ పొత్తులో ఉన్నారు. అయినా ఆ పార్టీని ఒప్పిస్తాను అని చెప్పారు.అలా అనుకున్నట్లుగానే బీజేపీని కూడా ఈ వైపుగా తెచ్చి మూడు పార్టీలతో బలమైన కూటమిని కట్టి 2024 ఎన్నికల్లో ఏపీలో 164 సీట్లు కూటమిని దక్కేలా చూడడంలో పవన్ పాత్ర కీలకంగానే ఉంది అన్నది వాస్తవం. ఇక వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేయడం ద్వారా జనసేన తన పంతం నెరవేర్చుకుందిపవన్ పిఠాపురం అసెంబ్లీ సీటుని ఎంచుకుని గెలిచి వచ్చారు. ఏకంగా 70 వేల పై చిలుకు మెజారిటీ ఆయనకు లభించింది. ఉప ముఖ్యమంత్రి కూడా అయ్యారు. కేవలం పవన్ మాత్రమే కాదు ఆ పార్టీ పొత్తులలో తీసుకున్న 21 అసెంబ్లీ రెండు ఎంపీలను కూడా గెలిచింది. అందుకే పిఠాపురంలో సభకు జయకేతనం పెట్టామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో పిఠాపురం సభ ద్వారా పవన్ కూటమిని మరింత బలోపేతం చేసే ప్రణాళికలను అలాగే ఏపీలో అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను చెబుతారు అని అంటున్నారు. అంతే కాదు ఆయన పిఠాపురం ప్రజలకు ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారు అన్నది కూడా వివరిస్తారు అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే రాజకీయ పార్టీలు సాధారణంగా సిద్ధాంత భూమిక పునాదిగా సాగుతాయి.కానీ పవన్ ఇమేజ్ మాత్రం వాటిని అన్నింటినీ అధిగమించి ముందుకు సాగే చోదక శక్తిగా మారింది. ఆయన వామపక్ష భావజాలం వినిపించినా లేక హిందూత్వ రాగం ఆలపించినా కూడా సై అనేలా రాజకీయం సాగుతోంది అంటే దటీజ్ పవన్ చరిష్మా అని చెప్పకతప్పదు. అరుదైన ఈ ఇమేజ్ పవన్ లాంటి వారికే ఉంటుంది అనడంలో సందేహం అయితే లేదు.

నేడు ఇబ్రహీంపట్నంలో విద్యుత్ అదాలత్

ఇబ్రహీంపట్నం, మార్చి 14 (వార్తా ప్రభ ప్రతినిధి) : ఇబ్రహీంపట్నం ముత్తవరపు కల్యాణ మండపంలో ఈ నెల నేడు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడవారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిం చనున్నట్లు విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే ఈ విద్యుత్ అదాలత్ లో డివిజన్ లోని విద్యుత్ వినియోగ దారులు తమ సమస్యలను సర్వీసు కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, మొబైల్ నెంబర్ తో రాతపూర్వకంగా ఫిర్యాదును అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వాలీబాల్ డిప్యూటీ చీఫ్ రిఫరీ డానియేల్ కు సత్కారం

ఇబ్రహీంపట్నం, మార్చి 14 (వార్తా ప్రభ ప్రతినిధి): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపునకు చెందిన ఇంటర్నేషనల్ వాలీబాల్ రిఫరీ ఎం.డానియేల్ డిప్యూటీ చీఫ్ రిఫరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డానియేల్ ను వ్యాగన్ వర్క్ షాపు సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. వర్క్ షాపు అధికారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ ఎ.చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి హనుమ నాయక్, పీఈ మరియు డబ్ల్యూపీవో బి.శైలా సుధాకర్, రైల్వే ఇన్ స్టిట్యూట్ కమిటీ సభ్యులు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మ గిరిప్రదక్షిణలో ప్రసాదాల పంపిణీ పై అవ్వారు బుల్లబ్బాయి హర్షం

విజయవాడ పశ్చిమ మార్చి 14 :(వార్తా ప్రభ ప్రతినిధి) ప్రతి నెలా పౌర్ణమి రోజున శ్రీకనకదుర్గమ్మ ఇంద్ర కీలాద్రి గిరి ప్రదక్షిణ సమయంలో భక్తులకు అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేయడం పట్ల శ్రీ శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఏపీ కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి, అధ్యక్షులు ఎస్ వాసు, సెక్రటరీ వెంకయ్య, వి రామకృష్ణ, మారుతి, కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో దుర్గగుడి ఈవో కు అభినందనలు తెలియజేశారు. శుక్రవారం ఉదయం జరిగిన శ్రీ కనకదుర్గమ్మ వారి గిరిప్రదక్షిణ లో పాల్గొనే భక్తులు ఈ ప్రసాదాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో స్వీకరించడం జరిగిందన్నారు. అయితే గత కొంత కాలం నుంచి గిరిప్రదక్షిణ సమయంలో అమ్మవారి ప్రసాదం తమకు అందడం లేదన్న ఆవేదన భక్తులు కనబరుస్తున్నారన్న విషయాన్ని తాము పత్రికా రూపంగా తెలియజేసిన వెంటనే నేటి గిరి ప్రదర్శనలో భక్తులకు లడ్డూ ప్రసాదం అందించడం హర్షణీయమని వారు పేర్కొన్నారు.

రాష్ట్రాలు ఏవైనా ఆర్యవైశ్యుల సంక్షేమ మే ధ్యేయంగా పనిచేద్దాం

డూండి రాకేష్ ని కలిసిన తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత

విజయవాడ పశ్చిమ మార్చి 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ని భవనిపురం లోని ఆయన కార్యాలయానికి వచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రాలు ఏవైనా ఆర్యవైశ్యుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దామని అనుకున్నారు.కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ గా తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం మరియు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా చేస్తున్న విధానాన్ని పేద ఆర్యవైశ్యులకు రుణాలు మరియు ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలన్ని అడిగి తెలుసుకున్న కల్వ సుజాత కు డూండి వివరించారు. ఇలా ఒకరి అభిప్రాయం ఒకరికి పంచుకొంటూ అర్యవైశ్యుల సంక్షేమం కోసం పాటూ పడదామనిఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ కాల్వ సుజాత కు తెలిపారు.

బెజవాడలో వైభోపేతంగా గిరిప్రదక్షణ

విజయవాడ పశ్చిమ మార్చి 14 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శుక్రవారం భక్తి ప్రపత్తులతో వైభోపేతంగా జరిగింది.శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం,ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టం.శుక్రవారం ఉదయం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవముగా ప్రారంభమైయింది.ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం ను ప్రారంభించారు. వివిధ కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.ఘాట్ రోడ్ అమ్మవారి గుడి,కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ప్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది.భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణమహోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ

మంగళగిరి,మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) యుగయుగాల దేవుడు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 12.00 గం.లకు నిర్వహించిన స్వామి వారి కల్యాణమహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామివారికి ప్రభుత్వం తరఫున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివార్లకు విష్వక్షణ ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, మధుపర్క నివేదన, స్వామివారి పాదపక్షాలన, విశేష అర్చన, మహా సంకల్పం, ముత్యపు తలంబ్రాలు, బ్రహ్మముడి, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ దంపతుల రాకను పురస్కరించుకుని ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ దంపతులకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గురజా గ్రామంలో జనసేన పార్టీ 12 ఆవిర్భవ దినోత్సవం.

నియోజకవర్గం నుండి పిఠాపురం కు భారీగా తరలివెళ్లిన జనసేన నాయకులు. కార్యకర్తలు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ.

ముదినేపల్లి మార్చి 14(వార్తా ప్రభ) ఏలూరు జిల్లా,కైకలూరు నియోజకవర్గం,ముదినేపల్లి మండలం,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని.గురజా గ్రామంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్న శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మరియు జనసేన నాయకులు,అనంతరం కైకలూరు నియోజకవర్గం నుండి పిఠాపురం నియోజకవర్గంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లిన జనసేన నాయకులు, కార్యకర్తలు,అభిమానులు.

కరాటే పరీక్షలో టాలెంట్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కరాటే లో అత్యుత్తమ ప్రదర్శన కనిపించి 6 మంది ఆరేజ్ బెల్ట్, 22 మంది ఎల్లో బెల్ట్ కు ఎంపిక

ఇబ్రహీంపట్నం, మార్చి 14 (వార్తా ప్రభ ప్రతినిధి):కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని టాలెంట్ హై స్కూల్ లో చదువుతున్న పిల్లలు కరాటేలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచన 22 విద్యార్థులు ఆరెంజ్ బెల్ట్ సాధించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం ఉండాలనే సంకల్పంతో స్కూల్ యాజమాన్యం ప్రోత్బలం తో కరాటే మాస్టర్ మురళి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.ఆదివారం స్కూల్ ఆవరణలో జరిగిన పరీక్షలో కరాటే విభాగంలో 6విద్యార్థులు ఆరంజ్ బెల్ట్, 22 విద్యార్థులు ఎల్లో బెల్ట్ విద్యార్థులకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో నైపుణ్యం పొందడం చాలా సంతోషకర అని, ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

లుంబిని విద్యాలయంలో ఘనంగా సరస్వతి పూజ

చేజర్ల మార్చి 14 (వార్తాప్రభ) లుంబిని విద్యాలయం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో శుక్రవారం ఘనంగా సరస్వతి పూజలు నిర్వహించారు.పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు వెళుతున్న నేపథ్యంలో పాఠశాలలో సరస్వతి పూజను నిర్వహించుట జరిగింది.ఈ కార్యక్రమం అనంతరం పదవ తరగతి విద్యార్థులకు కరస్పాండెంట్ రామయ్య దంపతుల చేతుల మీదుగా హాల్ టికెట్స్ పంపిణీ చేయుట జరిగింది.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల మోడల్ పరీక్ష

రెడ్డిగూడెం మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ నందు గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశానికి జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుక్రవారం నాడు మోడల్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష పేపర్ ను రెవరెండ్ జి విశ్వనాథ్, రెడ్డిగూడెం వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్ విడుదల చేశారు. ఏప్రిల్ నెలలో జరిగే పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల, కార్యదర్శి సిహెచ్ హన్న తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా విద్యుత్ హెచ్ఆర్ కమిటీ

సిఐటియూ మహేష్

ఇబ్రహీంపట్నం, మార్చి 14, (వార్తా ప్రభ ప్రతినిధి): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న టువంటి హెచ్ఆర్ కమిటీ సమావేశం తూతూ మంత్రంగా జరిగిందని ఇబ్రహీంపట్నం సిఐటియు మండల నాయకులు ఎం మహేష్ పేర్కొన్నారు. అటు కార్మికులకు ఉద్యోగులకు ఎవరికి ఒక్క సమస్య కూడా పరిష్కరించే రీతిలో హెచ్ఆర్ కమిటీ సమావేశం జరగలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల అరియర్స్ అమౌంట్ పైన నిర్దిష్టమైన పరిష్కారం లేదన్నారు. రాబోయే కాలంలో ఉద్యమాలు చేయక తప్పదు అన్నారు. పోరాటాలతోనే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సాధించుకుంటామన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.

:

కలిదిండి మార్చి 14 (వార్తా ప్రభ)ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు,కైకలూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు దూలం నాగే శ్వర రావు, చలమలశెట్టి పార్వతి కుటుంబ ఆహ్వానం మేరకు కలిదిండి మండలం,ఆవకూరు లోని వారి స్వగృహమునందు జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు ఉత్తమ్ కుమార్ పూజ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు వైయస్సార్సీపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి మండవల్లి మండల ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్(రాము),కలిదిండి మండలం ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు,ఆవకూరు గ్రామ సర్పంచ్ నరహరిశెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వ జన ఆసుపత్రి ని ఆదుకోండి.

ఉమ్మడి జిల్లా లోని ముగ్గురు మంత్రులు మానవత్వం తో స్పందించి ఆదుకోండి.
కూటమి ప్రజాప్రతినిధులకు, డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి.



అనంతపురం, **మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి)**ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 500 పడకల నుంచి 750పడకల కు అప్ గ్రేడ్ చేసిన, నిధులు లేవు, సిబ్బంది లేరు, ఉన్న వారు సక్రమంగా పని చేయరు, మరి రోజు ఆసుపత్రి కి వేల మంది వచ్చే రోగుల కు దిక్కు ఎవరు? అని బిసి రిజర్వేషన్ ప్రదర్శన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు అని ప్రశ్నించారు.ప్రతి రోజు పది నుంచి పదిహేను మంది వివిధ కారణాలతో చనిపోవడం జరుగుతుందని,. కారణం అక్కడ వసతులు లేవు, డాక్టర్లు లేరు, ఉన్న సకాలంలో సేవలు అందటం లేదన్నారు.వివిధ రకాల టెస్ట్ ల కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు పని చేయవు, ఉదాహరణకు. సి.టి.స్కాన్,ఏం.ఆర్. ఐ,రే, ఇంటెన్సివ్ కేర్ యూనిట్,రక్త పరీక్షలు నిర్వహణ, ఇలా అనేక రోగ నిర్ధారణ కోసం పని చేయవలసినవి సకాలంలో పని చేయటం లేదన్నారు.దీని ఫలితంగా జిల్లా మారు మూల ప్రాంతాల నుంచి వస్తున్న రోగుల పరిస్థితి ఇక్కడ ఆగమ్య గొచరంగా ఉందని,అత్యంత విలువైన అత్యవసర సేవలు అందించే విభాగంలో డాక్టర్ ఉండరు, సిబ్బంది సరిగా స్పందించటం లేదన్నారు. ఇలా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి రోడ్డు ప్రమాదం జరిగిన వారికీ, తేలు, పాము, లాంటి విష పురుగుల ప్రమాదంకు గురి అయిన వారికీ సేవలు సకాలంలో అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇన్ని సమస్యలతో కొట్టుమిట్టడు తున్న ప్రభుత్వ ఆసుపత్రికి నిధుల కొరత ఉందని సిబ్బంది అధికారులు చెప్పడం విడ్డురంగా ఉందన్నారు.అందుకే జిల్లా కూటమి ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రిని నెలలో ఒక రోజు అయినా విజిట్ చేయాలని, ప్రభుత్వం తో మాట్లాడి నిధులను, సిబ్బంది ని ఏర్పాటు చేయాలని, పని వేలలలో డాక్టర్లు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు కూటమి ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ సమస్యను మానవత్వంతో చూడాలని జిల్లా కు చెందిన ఆర్థిక శాఖ మంత్రి కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కి, బి. సి.సంక్షేమ శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేస్తూ, నిధుల విడుదలకు మంత్రులు కృషి చేయాలని అనంతపురం జిల్లా ప్రజల ఆర్థిక పరిస్థితిని, జిల్లా కరువు పరిస్థితు లను పరిగణలోకి తీసుకొని బాధ్యతతో పని చేయాలని మరొక సారి డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు

1904 ఒలింపిక్స్ గోల్డ్‌మెడల్‌కు వేలంలో రూ.4.72 కోట్లు



బోస్టన్: అమెరికా గడ్డపై తొలిసారిగా సెయింట్ లూయి నగరంలో 1904లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల బంగారు పతకం తాజా వేలంలో రూ.4.72 కోట్లు (5,45,371 డాలర్లు) పలికినట్లు సంబంధిత కంపెనీ శుక్రవారం వెల్లడించింది. ఈ పతకానికి ఓవైపున 'ఒలింపియాడ్, 1904' అనే అక్షరాలతోపాటు విజేతగా నిలిచిన అథ్లెట్ పూలదండ పట్టుకొన్న బొమ్మ ఉంది. మరోవైపు పురాతన గ్రీకు పురాణాల్లోని విజయ దేవత నైక్‌తోపాటు దేవతల రాజు అయిన జ్యూస్ బొమ్మను చిత్రించారు. 110 మీటర్ల హర్డిల్స్ పోటీల విజేత అయిన అమెరికన్ క్రీడకారుడు ఫ్రెడ్ షుల్‌కు ఈ స్వర్ణపతకాన్ని ప్రదానం చేశారు. దీంతోపాటు ఇచ్చిన రిబ్బను, లెదర్ బాక్సు కూడా అలాగే ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని స్మారక వస్తువులనూ వేలం వేశారు. సెయింట్ లూయి ఒలింపిక్స్‌లోనే విజేతలకు తొలిసారిగా అచ్చమైన బంగారు పతకాలు ఇచ్చారు. నాటి క్రీడల్లో మొత్తం 96 బంగారు పతకాల్లో 78 మెడల్స్ అమెరికన్లే గెలుచుకున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికై మార్చి 15న నిరసన దీక్ష

తిరుపతి, మార్చి 14 (వార్తాప్రభ) : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మార్చి 15న విజయవాడ ధర్నా చౌక్ నందు జరిగే "నిరసన దీక్ష"కు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్వియూ ప్రధాన ద్వారం ఎదుట పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు తక్షణమే విడుదల చేసి, ఈ సంవత్సరం ఫిజు రియాంబర్షిమెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంకు ఎస్వియూ కార్యదర్శి వినోద్ కుమార్ అధ్యక్షత వహించారు. వెటర్నరీ విద్యార్థి సంఘం నాయకులు పవన్ నాయక్, నీలిమ మాట్లాడుతూ గత 38 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వెటర్నరీ విద్యార్థులకి నేటి ధరలకి అనుగుణంగా స్టైఫండ్ పెంచాలని న్యాయమైన డిమాండ్ కోసం పోరాడుతున్న ప్రభుత్వం స్పందించి పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. మెడికల్ విద్యార్థులతో సమానంగా జంతు పరిరక్షణ కోసం ఎన్నో సేవలు చేస్తున్న వారితో సమానంగా చూడటం లేదని తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి స్పందించి పరిష్కరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ రాష్టంలో గత బకాయిలు ఇవ్వకుండా, నేటి విద్యా సంవత్సరం కూడా కొంత మాత్రమే ఫీజులు చెల్లించి చేతులు దులుపుకోవడం సరికాదని తక్షణమే ఫీజుల బకాయిలు అన్ని చెల్లించాలని, ఎపి పిజి సెట్ ను రద్దు చేసి యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిను కాపాడి ఆయా వర్సిటీలకే అడ్మిషన్స్ నిర్వహించుకోడానికి అవకాశం కల్పించాలని, మెడికల్ కళాశాల ప్రైవేటికరణ ఆపాలని, ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్మించి నడపాలని ఈ ప్రధాన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 15న విజయవాడ ధర్నా చౌక్ దగ్గర జరిగే నిరసన దీక్షలో సమస్యలు ఎదురుకుంటున్న విద్యార్థులు అందరూ పాల్గొని సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారం కోసం అందరూ ఒక్కటై పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తేజ, వెటర్నరీ విద్యార్థి నాయకులు పి.నశ్వర్ ఖాన్, ఇజ్రా, ప్రవీణ, ఎస్ఎఫ్ఐ వర్సిటీ నాయకులు భాస్కర్, తిరుమలేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చుక ప్రబోధం

నొప్పించే మాటలు
తెప్పించును కోపము
మెప్పించే చర్యలు
చేస్తేనే గౌరవము
నీచమైన తలపులు
తెచ్చును తలవంపులు
ఆదిలో త్రుంచితే
మిగులు పేరు ప్రతిష్టలు
నీతిలేని మనుషులు
చూడ ఎండమావులు
ఉపయోగము శూన్యము
అంతులేని నష్టము
మెదడు లేని కండలు
పగిలిపోయిన కుండలు
దేనికీ!కొరగావు
గాడి తప్పిన మనసులు
-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు

రాగూర్ పాఠశాలలో ఘనంగా సరస్వతి పూజ

అనుమసముద్రంపేట మార్చి 14 (వార్తాప్రభ) మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని రాగూర్ పాఠశాలలో శుక్రవారం సరస్వతి దేవి పూజను ఘనంగా నిర్వహించారు. రాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు ,డైరెక్టర్ కె దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా పూజారి ప్రసాద్ సరస్వతి దేవి చిత్రపటం వద్ద పదవ తరగతి విద్యార్థుల హాల్ టికెట్లు ఉంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిహెచ్ రమణారెడ్డి హెచ్ఎం కే దొరసామిరెడ్డిలు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి ఇష్టపడి బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు అనంతరం పాఠశాలలోని తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు పరీక్షలకు వెళ్లే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని 9వ తరగతి విద్యార్థులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల లోని ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాదిన్నరలోపు విభిన్న ప్రతిభావంతులందరికీ ఉపకరణాలు అందజేస్తాము

విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ పశ్చిమమార్చి 14 :(వార్తా ప్రభ ప్రతినిధి) కేంద్ర ప్రభుత్వం, అలింకో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాలు పంపిణీఎంపి కేశినేని చొరవతో 715 మంది ఉపకరణాలు అందజేత కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. గత ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పట్టించుకోలేదు. ఎన్టీఆర్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా విభిన్న ప్రతిభావంతులకు కావాల్సిన ఉపకరణాల గుర్తింపు కేంద్ర ప్రభుత్వం 2022 లోనే ఎంపిక పూర్తి చేయటం జరిగింది. గత మూడేళ్లుగా ఎంపిక చేసిన వారికి ఉపకరణాల పంపిణీ చేయకుండా నిర్లక్ష్య వైఖరితో గత ప్రభుత్వం వ్యవహరించింది. ఇది ప్రజా ప్రభుత్వం...మీరు కోరుకునే విధంగా పనిచేస్తుంది. మీ అండగా వుంటూ మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు..ఎన్టీఆర్ జిల్లా, కేంద్ర ప్రభుత్వం, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో సంస్థ సహకారం తో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, ట్రై సైకిల్, కృత్రిమ అవయవాలు పంపణి కార్యక్రమం శుక్రవారం మొఘల్ రాజపురంలోని సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు పాల్గొన్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన 715 మంది విభిన్న ప్రతిభావంతులకి వారికి అవసరమైన బ్యాటరీ నడిచే ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చంక కర్రలు, చెవిటి మిషన్లు, కృతిమ అవయవాలు, క్యాలిపర్స్ వంటి ఉపకరణాలు ఉచితంగా అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో 140 మందికి బ్యాటరీ నడిచే మూడు చక్రముల బండ్లు, 121 మంది మూడు చక్రముల సైకిళ్లు, 8 మందికి సి.పి చైర్లు, 71 మందికి వీల్ చైర్లు, 87 మందికి చంక కర్రలు, 128 మంది వినికిడి యంత్రాలు, 29 మందికి ఏం.ఎస్.ఐ.డి కిట్లు, 20 మందికి రోల్లెటర్లు, 20 మందికి చేతి కర్రలు, మరో91 మందికి వారికి అవసరమైన ఉపకరణాలు దాదాపు కొటి నాలుగు లక్షల రూపాయల విలువ చేసే ఉపకరణాలు ఉచితంగా అందించారు.విభిన్న ప్రతిభావంతులకి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లు కలిసి ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు వారి అవసరాలకు సరిపడా ఉపకరణాలు అందించటం చాలా సంతోషంగా వుందన్నారు. కేంద్రం 2022 లో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు ఉచితంగా ఇవ్వాలని జాబితా తయారుచేస్తే గత ప్రభుత్వం దీన్ని పట్టించుకున్నదాఖాలలు లేవన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే విజయవాడ ఎంపిగా తాను జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు కృషి చేయటం జరిగిందన్నారు. రెండు నెలల క్రితమే వీటిని హైదరాబాద్ నుంచి తెప్పించటం జరిగింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే విభిన్న ప్రతిభావంతులకు చెప్పినట్లు ఆరు వేల రూపాయలు పెన్షన్ గా అందచేస్తున్నారు.అలాగే పెన్షన్ తో పాటు మీ ఆత్మవిశ్వాసం మరింత పెరిగేందుకు అవసరమైన ఉపకరణాలు అందచేస్తున్నారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులందరికీ ఉపకరణాలు అందిలా ప్రతి మూడు నెలలకొకసారి ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని మాట ఇచ్చారు. జిల్లా అభివృద్ధిలో తమ కంటే కలెక్టర్ లక్ష్మీశ రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నిత్యం ప్రజల మధ్య వుంటూ ప్రజల సమస్య పరిష్కారం పనిచేస్తారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజకీయ నాయకులు ఎక్కడ వుండేవారో ఎవరికి తెలిసేది కాదని, ప్రజా ప్రభుత్వంలో తామందరం అధికారుల్లాగా ప్రజల మధ్యనే వుంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కేంద్రం నుంచి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు రావాల్సిన ఉపకరణాలు మంజూరు కోసం ఎంపి కేశినేని శివనాథ్ చూపిన చొరవ తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందించటంలో వెనకడుగు వేయనని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి వల్ల కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉపయోగించి ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపి బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు , అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు ముప్పు ప్రభుత్వం తొలగిస్తుందా...?

గత సంవత్సరం జరిగిన బుడమేరుముప్పు

గన్నవరం,మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) విజయవాడప్రజలు ఇంకా ఎప్పటికీ మరిచిపోలేరు. ఏ ప్రభుత్వం అయినా సమస్య వచ్చినప్పుడు విపరీతమైన హామీలు ఇస్తూ ఉంటారు. అది సాధ్యం కానీ, లేదా సాధ్యం కాకపోవచ్చు. కానీ ఏప్రిల్, మే నెలలో బుడమేరు ఆక్రమణలు తొలగించకపోతే పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం. కొన్నిచోట్ల వర్షాలు పడకపోవచ్చు. కానీ వర్షాలు పడిన చోట కుంభవృష్టి పడి, అక్కడి వాగులు వంకలు పొంగుతున్నాయి. గతంలో హైదరాబాదు ,మొన్న వరంగల్, నిన్న మన విజయవాడ. మనం మనుషులం కనపడితే ఖాళీ స్థలం కబ్జా చేయడమే మనిషి బుద్ధి. అది ప్రకృతిలో సహజంగా ఏర్పడిన వాగులు, చెరువులు కనుమరుగైపోవటమే ఈ ముంపులకు కారణం. ప్రభుత్వం నడుము బిగించి బుడమేరు ఆక్రమణ తొలగించకపోతే మరో ముప్పు పొంచి ఉండక తప్పదు. కొన్నిచోట్ల బుడమేరు వెడల్పు 100 మీటర్లు ఉంటే కొన్నిచోట్ల10 వెడల్పు మీటర్లే ఉంది సుమారుగా. జూన్ నెల మొదలయితే నైరుతి రుతుపవనాలు వచ్చేస్తాయి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రక్షాళన మొదలు పెట్టాలి .

యువకుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకై షేక్ గయాసుద్దీన్ ఆర్థిక సాయం

విజయవాడ పశ్చిమ మార్చి 14: (వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక 41వ డివిజన్ దర్గా ప్రాంతానికి చెందిన ఆదిల్ (19)అనే యువకుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకై 20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) శుక్రవారం సాయంత్రం భవానిపురంలోనీ తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గయాసుద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఆదిల్ తన ఎడమకాలును కోల్పోయాడని, ఈ విషయాన్ని ఆయన మిత్రబృందం తన దృష్టికి తీసుకురావడం జరిగిందనీ అన్నారు. ఆదిల్ కి ఆయన మిత్రబృందం సహాయం చేస్తున్న విషయం తన దృష్టికి రావడంతో తన వంతు సహాయంగా 20 వేల రూపాయలను అందించడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన నాట్యోత్సవాలు .

అవనిగడ్డ : మార్చి 14(వార్తాప్రభ ప్రతినిధి)డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ కూచిపూడి నాట్య శిల్పారామం, శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో కొనసాగుతున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవ అనుబంధ సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం తో ముగిశాయి. కూచిపూడి లోనిశ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై నిర్వహిస్తున్న నాట్య ప్రదర్శనలలో భాగంగా ప్రముఖ సంగీత సాహిత్య నాట్యాచార్య దండిభొట్ల నారాయణమూర్తి(హైదరాబాద్) శిష్యురాండ్రు నందిని, గీత, త్రివేణి, లిఖితసహస్ర , మనస్వి, హర్షిత ప్రదర్శించిన అంశాలు ఆహూతులను రజింపచేశాయి, శ్రీ గురు కృప సంగీత నృత్య కళా నికేతన్ (అనంతపురం) డైరెక్టర్ డాక్టర్ పట్నం శివప్రసాద్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ముగ్ధులను గావించాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం ఆధ్వర్యంలో. కళాకారులను అంగవస్త్రాలతో, ప్రశంసా పత్రాలతో, మెడల్స్ తో సత్కరించారు.

భవిష్యత్‌లో డ్రోన్లదే కీలకపాత్ర

నెల్లిమర్ల, మార్చి 14(వార్తాప్రభ ప్రతినిధి) :భవిష్యత్‌లో డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ అనీల్ కుమార్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యా లయం సంయుక్తంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తొన్న వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంపవరింగ్ స్కిల్స్ త్రో డ్రోన్ టెక్నాలజీ అనే వర్క్ షాపు ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌లో ఉపాధి అవకాశాల గురించి వివరించారు. చీఫ్ పాట్రన్‌గా పాల్గొన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ రానున్న కాలంలో డ్రోన్లు ఏయే రంగాలలో ఉపయోగించడానికి అవకాశం ఉందో వివరించారు. గిరిజన ప్రాంతాలలో నేలల స్వభావం, నీటి వనరుల లభ్యత, ఆరోగ్యసేవలు అందించడంలో డ్రోన్లు కీలకపాత్ర పోషించ నున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డాక్టర్ బొంతు కోటయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సూపర్ బీ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తయారు చేస్తొన్న డ్రోన్ల తయారీ, పరిశోధన, డ్రోన్ల ప్రయోగం తదితర వాటిని తిలకించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్లుగా డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ చట్టర్జీ, డాక్టర్ ఎన్.వి.ఎస్.సూర్య నారాయణతో పాటు డాక్టర్ ఎం.జి.నాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ఎం.ప్రసాద్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు

విద్యాసామగ్రి వితరణ

పుత్తూరు (తిరుపతి) :మార్చి 14(వార్తాప్రభ ప్రతినిధి)రూరల్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు మహాసభ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి అధ్యక్షతన బుధవారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలనే ఉద్దే శంతో గొల్లపల్లి పాఠ శాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులు ఎన్.శ్రీరాములు. 10 వ తరగతి విద్యార్థులకు ప్యాడ్ పెన్నులు స్కేల్స్ పెన్సిల్స్ జామెంట్రీ బాక్సులు మొదలైన విద్యా సామగ్రిని అందిం చడం జరిగింది .10 వ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ప్రతిభ చూపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు
.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పన

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్

కర్నూలు, మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి) 6 నెలల్లో ఇంటిగ్రేటెడ్ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు అని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. శుక్రవారం పత్తికొండ మండలం, దూదేకొండ రెవెన్యూ గ్రామం, కోతిరాళ్ళ పంచాయతీ వద్ద రూ.11 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కు మంత్రి టీజీ భరత్..ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి భూమి పూజ నిర్వహించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కర్నూలు ఎంపీ, పత్తికొండ ఎంఎల్ఏ గారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి కోరగా వెంటనే అందుకు సంబంధించిన పనులు చేయాలని ముఖ్యమంత్రి వర్యులు గారు ఆదేశించడం జరిగిందన్నారు. ఆ మేరకు ఈ టొమాటో ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు కొరకు నిధులు పుష్కలంగా ఉన్నాయని.. ఈ ప్రాజెక్టు ఏర్పాటు 6 నెలలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి.. ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ, కాంట్రాక్టర్ లను ఆదేశించారు.. యూనిట్ స్థాపన త్వరగా పూర్తయితే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు స్థాపనకు 11 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 32 మందికి ప్రత్యక్ష ఉపాధి, 100 మందికి పరోక్ష ఉపాధి కల్పన ఉంటుందన్నారు..టొమాటో కెచప్, టొమాటో పేస్ట్, టొమాటో పికిల్ లాంటి ఉత్పత్తులు తయారు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏ రకమైన బాటిల్ లో అయినా కెచప్ ఒకటే రకంగా ఉంటుందని ఇక్కడ టొమాటో పంట పండించే రైతులతో మాట్లాడి ప్రత్యేకమైన జిన్ తో టొమాటో పంట పండిస్తే అదే రకమైన కెచప్ లాగా ఉండడంతో పాటు నాణ్యత కూడా ఉండడంతో సేల్ చేసుకునే దానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు.. టొమాటో పంటలు పండించే రైతులకి అటువంటి విషయాల గురించి వారిలో అవగాహన కల్పించాలని కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టొమాటో పల్ప్ చేసినట్లయితే రోజు 10 నుండి 15 మెట్రిక్ టన్నులు చేయవచ్చునన్నారు.. డీహైడ్రేషన్ కి ఐతే రోజు 5 మెట్రిక్ టన్నులు చేయవచ్చునన్నారు.. ఒకవేళ టొమాటో పంట లేని పక్షంలో మామిడి, బనానా, పపాయ, జామ పండ్లను ప్రాసెస్ చేసుకోవచ్చునన్నారు. జిల్లాలో పత్తికొండ ప్రాంతంలో టొమాటో పంట సాగు చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ యూనిట్ ఏర్పడిన తర్వాత టొమాటో లు రోడ్ల మీద పడేసే పరిస్థితి ఎక్కడ ఉండదన్నారు. రానున్న రోజుల్లో ప్రైవేట్ వ్యక్తులు కూడా చాలా మంది ఈ యూనిట్ లు పెట్టేందుకు ముందుకు వస్తారన్నారు. అదే విధంగా తుగ్గలి, దేవనకొండ, క్రిష్ణగిరి, ఆదోని, గొనేగండ్ల, ఆస్పరి, ఆలూరు ప్రాంతాల వారికి ఈ యూనిట్ చాలా ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకి సంబంధించి కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ అంశం పై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించిన సమయంలో ఈ 5 ఏళ్లలో 30 వేల కోట్ల పెట్టుబడులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ద్వారా రావాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, టార్గెట్ పెట్టుకొని కష్టపడుతున్నట్లు చెప్పారు. దుబాయికి వెళ్ళిన సమయంలో ఫుడ్ ప్రాసెసింగ్ కి సంబంధించి చాలా మంది పారిశ్రామిక వేత్తలను కలవడం జరిగిందన్నారు. వారిని కూడా ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాలని రిక్వెస్ట్ చేయడం జరిగిందన్నారు.. ఫుడ్ ప్రాసెసింగ్ కి సంబంధించిన వాటిలో ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ స్థాయిలో వచ్చే అవకాశం ఉందన్నారు.. 2014 నుండి 2019 సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పుడు చంద్రబాబు శంకుస్థాపన చేసిన స్టీల్ ప్లాంట్.. గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందని.. అన్నింటిని అధిగమించి వచ్చే నెల 19వ తేదిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వలసలు నివారించి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ లో చాలా మేరకు పెద్ద ఎత్తున్న పరిశ్రమలు రానున్నాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్ కూడా అవసరమన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా పెన్షన్ మొత్తాన్ని మన రాష్ట్రంలో ఇస్తున్నామన్నారు. వైజాగ్ లో కూడా ఎన్నో దిగ్గజ ఐటి కంపెనీ లు రానున్నాయన్నాని మంత్రి పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ నిమిత్తం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు పత్తికొండకు వచ్చిన సందర్భంగా మన ప్రాంతానికి టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరామని, ఆ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ. 11 కోట్ల రూపాయలతో టమోటా ప్రాసెస్ యూనిట్ కు శంకుస్థాపన జరిగిందన్నారు. ఇదే విధంగా ఓర్వకల్లు మండలంలో కూడా ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేయాలని మంత్రి మరియు జిల్లా కలెక్టర్ ని పార్లమెంటు సభ్యులు కోరారు .. ఈ కూటమి ప్రభుత్వంలోనే కర్నూలు నుండి బళ్లారికి హైవే రోడ్డు నిర్మాణం కొరకు కేంద్ర మంత్రి ఖడ్గే గారిని కోరడం జరిగిందన్నారు. సాధ్యమైనంత వరకు ఈ ప్రభుత్వ హయాంలోనే రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయడం జరుగుతుందని ఎంపీ అన్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టు ల పై అసెంబ్లీలో చర్చించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ పరంగా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, పారిశ్రామిక పరంగా జిల్లాలో టీజీ భరత్ మంత్రివర్యులు ఉన్నారు కావున ఈ ఐదు సంవత్సరాల్లో ఇరిగేషన్ పరంగా మరియు పారిశ్రామికంగా కర్నూలు అభివృద్ధి చెందుతుందని పార్లమెంట్ సభ్యులు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ టమాటో పండించే రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఈ టొమాటో ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు ను 11 కోట్ల రూపాయలతో తీసుకొని రావడం జరిగిందన్నారు... రాష్ట్రంలో టమోటో పంట లక్ష 20 వేల ఎకరాలలో పంట సాగు చేస్తే 7 వేల 900 హెక్టార్ల పంట మన జిల్లాలో సాగు అవుతుందని అందులో కూడా 30 నుండి 40 శాతం పంట సాగు పత్తికొండ లో అవుతుందన్నారు.. రేట్ ఉన్నపుడు మార్కెట్ లో అమ్ముకున్నప్పటికీ, మిగతా రోజులలో వాటిని ప్రాసెసింగ్ చేసి వివిధ రకాల ఫార్మాట్ లకు మార్చి వాటిని మార్కెటింగ్ చేసేందుకు వీలుగా ఈ యూనిట్ ను ఏర్పాటు చేయబోతున్నాం అన్నారు... వీటి ద్వారా రైతులకు ఉపయోగపడుతుందన్నారు.. వీటి ద్వారా ప్రత్యక్షంగా 32 మంది పరోక్షంగా 100 మంది కి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు... ఏ విధమైన ప్రొడక్ట్స్ ద్వారా లాభాలు వస్తాయనే అంశం మీద కూడా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.. టొమాటో నే కాకుండా వీటితో పాటు బొప్పాయి, అరటి, జమ లాంటి పండ్లను కూడా ప్రాసెసింగ్ చేసుకోవచ్చునన్నారు... జిల్లాలో అనేక రకాల యూనిట్ లను తీసుకొని రావాలని కలెక్టర్ మంత్రిని కోరారు..పత్తికొండ శాసనసభ్యులు కే ఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తూ ఉంటారు, ఒక్కొక్కసారి టమోటా కు గిట్టుబాటు ధర కూడా లేకుండా రేటు పూర్తిగా పడిపోవడం చేత రైతు చాలా నష్టపోతున్నారు, ఇది దృష్టిలో పెట్టుకొని మన గౌరవ ముఖ్యమంత్రివర్యులు పత్తికొండ నియోజకవర్గంలోని దూదేయకొండ రెవెన్యూ గ్రామ పరిధిలో 11 కోట్ల రూపాయలతో ఈ యూనిట్ నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ఈ యూనిట్ను 6 లేక 7 నెలలు పూర్తి చేస్తామని మంత్రి తెలియజేయడం చాలా సంతోషమన్నారు. ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ లో టమోటోలు మాత్రమే కాకుండా, వివిధ రకాల పండ్లను కూడా ప్రాసెసింగ్ చేయవచ్చునని అన్నారు, ఈ ప్రాంత రైతులు నాణ్యత కలిగిన టమోటాలను పండించాలన్నారు, ఈ ప్రాంత రైతులకు ఏ పంటను పండిస్తే ఈ యూనిట్ కు పనికి వస్తుందో దాని పైప్రభుత్వం రైతులకు శిక్షణ కూడా శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంత రైతులందరూ వ్యవసాయపరంగా బాగుపడాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో పందికోన కుడి కాలువ ద్వారా దేవనకొండ మండలంలో మంచి పంటలు పండిస్తున్నారు. ఎడమ కాలువ నుండి కూడ నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు...ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ డా.గెడ్డం శేఖర్ బాబు మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ లలో ఎక్కువ గ్రాంట్ మొత్తంతో 11 కోట్ల రూపాయలతో ఈ జిల్లాలో టొమాటో ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్ ఉందన్నారు.. ప్రాజెక్టు కి సంబంధించిన నిర్మాణం కూడా 6 నెలలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు... కార్యక్రమంలో వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, పత్తికొండ ఆర్డీఓ భరత్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, తుగ్గలి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు..

వాస్తు ప్రకారం మీ ఇంట్లో ఇలా చేసి చూడండి..! అద్భుతం జరుగుతోంది..!

వాస్తు శాస్త్రం ప్రకారం ఇంట్లో కొన్ని ముఖ్యమైన మార్పులు చేస్తే శుభ ఫలితాలు వస్తాయని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో సుఖసంతోషాలు, శాంతి, ధనలాభం అందించేందుకు పలు వాస్తు చిట్కాలు సూచించబడ్డాయి. ముఖ్యంగా డబ్బు సమస్యల నుంచి బయటపడేందుకు కొన్ని మార్గాలను పాటించమని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అందులో పసుపు కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వాస్తు ప్రకారం మీ ఇంట్లో ఇలా చేసి చూడండి..! అద్భుతం జరుగుతోంది..!పసుపు మన ఆరోగ్యానికి మంచిదే కాకుండా వాస్తు శాస్త్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. హిందూ సంప్రదాయంలో దీన్ని పవిత్రమైన పదార్థంగా పరిగణిస్తారు. ఇది శుభాన్ని, సంపదను ఆహ్వానించే లక్షణాలను కలిగి ఉందని నమ్మకం. కాబట్టి ఇంట్లో పసుపును సరైన విధంగా ఉపయోగిస్తే ఆర్థిక సమస్యలు దూరమవుతాయని అంటున్నారు వాస్తు నిపుణులు. పసుపు వంటల్లో మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో కూడా ఉపయోగిస్తారు. ఇది పరిశుభ్రతను, సానుకూల శక్తిని ప్రతిబింబిస్తుంది. ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన ఈ పసుపును వాస్తు శాస్త్రం ప్రకారం సరైన ప్రదేశంలో ఉంచడం వల్ల శుభ ఫలితాలు పొందవచ్చు. ఇంట్లో ధనాన్ని నిల్వ చేసేందుకు, దోషాలను నివారించేందుకు దీన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం. ఇంటి ప్రధాన ద్వారం ద్వారా శక్తి ప్రవేశిస్తుందని వాస్తు నిపుణులు చెబుతారు. కాబట్టి అక్కడ పసుపును ఉపయోగిస్తే దోషాలు తొలగిపోతాయని, మంచి శక్తులు ఆహ్వానించబడతాయని నమ్మకం. ముఖ్యంగా ప్రధాన ద్వారానికి పసుపుతో కూడిన బట్టను వేలాడదీయడం ద్వారా ఇంట్లో శుభ సమృద్ధి నెలకొంటుందని అంటారు. ఇలా చేస్తే లక్ష్మీదేవి కటాక్షం పొందుతారని పండితులు సూచిస్తున్నారు. మీరు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారా..? అయితే మీ డబ్బు పెట్టెలో పసుపు ముద్దను ఉంచడం వల్ల ఆర్థిక లాభాలు మెరుగవుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇది డబ్బు నిల్వ ఉండేలా చేస్తుందని, అనవసర ఖర్చులను తగ్గిస్తుందని నమ్మకం. ఇంట్లో సంపద పెరగాలంటే, దీన్ని పాటించి చూడండి. పర్సులో పసుపు ముద్దను ఉంచడం వల్ల లక్ష్మీదేవి కటాక్షం లభిస్తుందని సంపద నిలిచిపోతుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఇది మన డబ్బును రక్షించే శక్తిని కలిగి ఉందని ఆర్థిక వ్యవహారాల్లో లాభదాయకతను అందించగలదని నమ్ముతారు. కాబట్టి మీ సంపదను నిల్వ చేయాలంటే మీ పర్సులో పసుపును ఉంచి ప్రయత్నించండి. ఇంటి శుభ శాంతుల కోసం, ధనలాభం కోసం వాస్తు శాస్త్రం లోని కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పసుపును సరిగ్గా ఉపయోగించడం వల్ల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని ఇంట్లో శుభదాయకమైన శక్తులు నెలకొంటాయని భావిస్తారు.

మైలవరం లో పాలిథిన్ కవర్ల నిషేధం ఎక్కడ...?

● యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు ● పేపర్లకే పరిమితమైన అధికారుల ఆదేశాలు ● సఫలీకృతం కానీ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు ● మసకబారుతున్న స్వచ్ఛ ఆంధ్ర సేవా కార్యక్రమాలు ● రైతుబజారు లోనూ నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు ● నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు.

మైలవరం:మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి)మైలవరం పట్టణంలో ప్లాస్టిక్ విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపి వేయాలని లేని పక్షంలో చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామ పంచాయితీ అధికారులు వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నవారికి నోటీసులు జారీ చేస్తూనే ఉన్నారు. అంతే కాకుండా కాకుండా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం పై గ్రామాలలో అధికారులు పెద్ద ఎత్తున బేనర్లు వేసి ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినా నిషేధిత ప్లాస్టిక్ వాడకం ఆగటం లేదు. ఏ ఒక్కరూ అధికారుల ఆదేశాలు ఖాతరు చేయడం లేదు. అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ప్లాస్టిక్ వాడుకం రోజురోజుకు పెరిగిపోతుంది. ఇలాగే కొనసాగితే పర్యావరణానికి పెద్ద ఎత్తున ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. పువ్వులు అమ్మే వారు మొదలు, మాంసం దుకాణాలలో, చిల్లర దుకాణాలలో, హెరీటళ్లలో, కూరగాయలు అమ్మే దుకాణాలలో, పండ్ల దుకాణాలలో, బేకరీలలో, కర్రీ పాయింట్లలో, టీ స్టాళ్ళలో ఇలా ఎవరికి వారు ప్లాస్టిక్ కవర్లను విచ్చల విడిగా వాడుతున్నారు. ఇవే కాకుండా డిస్పోజబుల్ గ్లాసులు, స్ట్రాలు, కప్లు ఇలా చాలా రకాలుగా నిషేధిత ప్లాస్టిక్ ను వాడుతున్నారు. అయిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయితీ అధికారులు గతంలో జారీ చేసిన నోటీసులను వ్యాపారస్తులు చెత్త బుట్టలకు పరిమితం చేశారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించిన ర్యాలీలు జిల్లా ఉన్నతాధికారుల కంటి తుడుపుగా మిగిలాయి. దీంతో గ్రామాలలో చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు ఒక్కొక్కటిగా మసకబారుతున్నాయి. ముఖ్యంగా మైలవరం పట్టణంలో ప్లాస్టిక్ వాడకం బాగా పెరిగిపోయింది. వ్యాపారస్తులు నాసిరకం ప్లాస్టిక్ కవర్లు తెచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం అడటమే కాకుండా పర్యావరణానికి పెనుముప్పు గా కారణమవుతున్నారు. పట్టణంలోని రైతు బజార్లోనూ నాసిరకం ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువయ్యింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : పిఒ

పార్వతీపురం, మార్చి 14 (వార్తాప్రభ ప్రతినిధి: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థు లంతా ఉత్తమ ఫలితాలను సాధించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపు నిచ్చారు. మండలంలోని రావికోనలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను పిఒ బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఆ పరీక్షలకు విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇష్టంగా చదవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు గురికావద్దని హితవు పలికారు. ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలంటే పదో తరగతి పునాది అని, అందుకే దీనిపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. అనంతరం స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి, టెన్త్‌లో మంచి విజయం సాధించాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.

అంబానీ ఎవరో తెలీదు.. గాయని వ్యాఖ్యల దుమారం

గత ఏడాది ప్రపంచ కుభేరుడు ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ– రాధికా మర్చంట్ జంట వివాహం అంగరంగ వైభవంగా సాగిన సంగతి తెలిసిందే. మూడు దఫాలుగా కొన్ని నెలల పాటు సాగిన ఈ వివాహ వేడుకల కోసం అంబానీలు ఏకంగా 5000 కోట్లు పైగా ఖర్చు చేయడం సంచలనమైంది. ఈ పెళ్లి వేడుకలో పలువురు పాప్ సింగర్లు పెర్ఫామ్ చేసారు. తమ ప్రదర్శనల కోసం కోట్లాది రూపాయల పారితోషికాలు అందుకున్నారు. పాప్ గాయకుడు జస్టిన్ బీబర్ అత్యధికంగా 83 కోట్లు అందుకోగా, పాప్ గాయని రిహానా 50 కోట్లు అందుకుందని కథనాలొచ్చాయి. రియాలిటీ టీవీ స్టార్స్ కిమ్ కర్ధాషియన్ – ఖోలే కర్ధాషియన్ సోదరీమణులు కూడా ఈ పెళ్లిలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సిస్టర్స్ ఇద్దరికీ అంబానీలు పెద్ద మొత్తంలో ముట్ట జెప్పారని గుసగుసలు వినిపించాయి. అయితే అమెరికన్ రియాలిటీ టీవీ స్టార్స్ కిమ్ ఖోలే తాజా వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఈ వారం ప్రసారమైన వారి హిట్ షో ది కర్ధాషియన్స్‌తాజా ఎపిసోడ్ ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిగ్గా మారింది. ఆశ్చర్యకరంగా, కిమ్ తనకు అంబానీ కుటుంబం గురించి తెలియదని వ్యాఖ్యానించింది. సుమారు రూ.5000 కోట్లు ఖర్చుతో అత్యంత విలాసవంతంగా సాగించిన ఈ పెళ్లి వేడుకకు హాజరవ్వడం కిమ్ కి మరపురాని అనుభవం. ఒక పరస్పర స్నేహితుడి ద్వారా తమకు ఆహ్వానం అందిందని, ఆ పెళ్లికి వెళ్లాలా వద్దా అనేది ఆకస్మిక నిర్ణయమని కిమ్ వెల్లడించారు. ఎపిసోడ్‌లో కిమ్ మాట్లాడుతూ.. నిజానికి నాకు అంబానీలు ఎవరో తెలియదు. మాకు ఉమ్మడి స్నేహితుల ద్వారా పరిచయం అని కిమ్ వ్యాఖ్యానించారు. కర్ధాషియన్ సోదరీమణులను ముంబైకి తీసుకువచ్చిన సంబంధం ప్రఖ్యాత ఆభరణాల వ్యాపారి లోరైన్ స్వార్జ్. అంబానీ కుటుంబానికి నగలు డిజైన్ చేసే సన్నిహితులు లోరైన్. లోరైన్ స్వార్జ్ మా మంచి స్నేహితుల్లో ఒకరు. ఆమె ఒక ఆభరణాల వ్యాపారి. ఆమె అంబానీ కుటుంబానికి నగలు చేస్తుంది. ఆమె వారి వివాహానికి వెళుతున్నానని నాకు చెప్పింది. వారు మిమ్మల్ని ఆహ్వానించడానికి ఇష్టపడతారని ఆమె చెప్పారని కిమ్ తెలిపారు. కిమ్ కర్ధాషియన్– ఖోయ్‌లే కర్ధాషియన్ సిస్టర్స్ కి ఇతర ఆహ్వానంలా కాకుండా ప్రత్యేకమైన ఆహ్వానం అందింది. 40–50 పౌండ్లు ఖరీదు చేసే ఖరీదైన ఆహ్వానపత్రిక.. దాని నుండి సంగీతం హృదయాలను తాకిందని కిమ్ కర్ధాషియన్ ఈ రియాలిటీ షోలో తెలిపింది. 18 నుంచి 22 కిలోల మధ్య బరువున్న ఈ విలాసవంతమైన ఆహ్వాన పత్రిక ఒక కళాఖండం. అంబానీల వైభవాన్ని సూచించేలా ఇది పిచ్చిగా ఉంది! అని ఖోయ్ లే వెల్లడించారు. మేము ఆహ్వానాన్ని చూసినప్పుడు ఇలాంటి వాటికి నో చెప్పకూడదని భావించాము అని తెలిపారు. అయితే అంబానీలు ఎవరో తెలీదు! అని కిమ్ దురుద్దేశంతో వ్యాఖ్యానించలేదు. కేవలం తనకు ఉమ్మడి స్నేహితుల ద్వారా తెలుసు అని మాత్రమే వ్యాఖ్యానించారు. నిజానికి కిమ్– ఖోలే సిస్టర్స్ అంబానీల వైభవాన్ని ప్రశంసించారు. బిలియనీర్ ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ –రాధిక మర్చంట్ వివాహం 12 జూలై 2024న ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ వేడుకల్లో రిహన్న, దిల్జిత్ దోసాంజ్, షారుఖ్ ఖాన్ దిగ్గజాల ప్రదర్శనలతో సందడిగా సాగింది. ప్రీ–వెడ్డింగ్ ఈవెంట్‌లతో నెలల తరబడి జరిగిన వేడుకల అనంతరం పెళ్లి వైభవంగా సాగింది. కిమ్ – ఖోయ్‌లే ఈ వేడుకల్లో భారతీయ వస్త్రధారణలతో కళ్లు చెదిరే ట్రీటిచ్చారు. మనీష్ మల్హోత్రా రూపొందించిన అద్భుతమైన భారతీయ లెహంగాలను ధరించి, లోరైన్ స్వార్జ్ రూపొందించిన ఆభరణాలతో అలంకరించారు.

ముగ్గురు భామల మధ్యలో జూనియర్ ధనుష్!

యంగ్ హీరో ప్రదీప్ రంగనాథ్ అలియాస్ జూనియర్ ధనుష్ ఇప్పుడు తెలుగింట ఎంత ఫేమస్ అయ్యాడో చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాలవ్ టుడే...ఇటీవల రిలీజ్ అయిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ తో రెండు యూత్ ఫుల్ విజయాలతో యువతలో క్రేజీగా హీరోగా మారిపోయాడు. భాషతో సంబంధం లేకుండా తెలుగు ఆడియన్స్ రంగనాథ్ ని నెత్తిన పెట్టుకున్నారు. ఇకపై జూనియర్ ధనుష్ మంచి కంటెంట్ ఉన్న ఎలాంటి సినిమా చేసినా? ఆదరణకు ఏ మాత్రం దక్కదని...అంతకంతకు అతడి ఇమేజ్ రెంట్టిపు అవుతుంది. ఇప్పటికే ప్రదీప్ రంగనాథ్ తో అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా కూడా నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. తెలుగు తమిళ్ లో ఈ చిత్రాన్ని కీర్తీ శ్వరన్ అనే కొత్త కుర్రాడు తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉందీ చిత్రం. 30 శాతం షూటింగ్ కూడా పూర్తయింది. ఇందులో ప్రదీప్ కి జంటగా ముగ్గురు భామలు నటిస్తున్నారుట. ఓ భామగా ఇప్పటికే మమితా బైజు ఫైనల్ అయింది. మిగిలిన రెండు పాత్రల్లో అను ఇమ్మాన్యేయేల్, ఐశ్వర్యా శర్మ ను ఎంపిక చేసినట్లు సమాచారం. మొత్తానికి ప్రదీప్ రంగనాథ్ మూడవ సినిమాల్లో రొమాంటికో బోయ్ గానే కనిపిస్తాడని తెలుస్తోంది. తొలి సినిమాలో లెక్కలేనంత మంది గాళ్ ఫ్రెండ్స్ ఉంటారు. రెండవ చిత్రంలోనూ ఇద్దరితో రొమాన్స్ చేస్తాడు. మూడవ సినిమాలో ఏకంగా ముగ్గురు భామల్ని తీసుకొస్తున్నారు. రంగనాథ్ బాడీ లాంగ్వేజ్ కి యూత్ ఫుల్ స్టోరీలు సరిగ్గా సెట్ అవుతున్నాయి. నవతరం దర్శకులు కూడా అతడి ఇమేజ్ ని బేస్ చేసుకునే స్టోరీలు సిద్ధం చేస్తున్నారు.

అన్నదానం కు 10 వేల 17/ రూపాయలు విరాళం

పెనుగంచిప్రోలు, మార్చి 14 (వార్తాప్రభ) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు మాడ సుబ్రహ్మణ్యం ధర్మపత్ని పూర్ణ లక్ష్మి, నల్లమోతు వారి పాలెం కర్లపాలెం మండలం బాపట్ల జిల్లా వాస్తవ్యులు అన్నదానమునకు రూ.5.116/-ఆలయ అధికారులకు విరాళం అందజేయడం జరిగింది. అలాగే చెన్ను దేవాన్స్, పేట్ బషీరా బాద్ కొంపల్లి హైదరాబాద్ తెలంగాణ వాస్తవ్యులు అన్న దానం కు రు. 5001/- విరాళం గా ఆలయ అధికారులకు అందజేశారు.వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది.

అన్నదానం కు,గోసం రక్షణకు, అంకమ్మ తల్లి వెండి తాపడం కు విరాళాలు

పెనుగంచిప్రోలు, మార్చి 14 (వార్తాప్రభ) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగుఅన్నదానం కు సంకూరి హనుమంతరావు ధర్మపత్ని లలిత ఆయుషాపూర్ విలేజ్ ఘట్కేసర్ మండలం మేడ్చల్ హైదరాబాద్ తెలంగాణ వాస్తవ్యులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన ము అన్నదానమునకు రూ.20.111 (ఇరవై వేల నూట పదకొండు రూపాయలు) గో సంరక్షణ కు రూ.20.000 ఇరవై వేలు మరియు అంకమ్మ అమ్మవారి వెండితాపడం మునకు రూ.10.000/- విరాళంగా సహాయ కార్యనిర్వహణదికారి తిరుమలేశ్వర రావు కు శుక్రవారం అందజేయడం జరిగింది. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండుగగా అద్దంకి నాంచారమ్మ జాతర

కోడూరు,మార్చి 14 (వార్తాప్రభ) : కొలిచిన వారికి కొంగు బంగారమై విశ్వనాధపల్లి కృష్ణానది తీరాన కొలువైయున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర కన్నుల పండుగగా సాగుతుంది. శుక్రవారం గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి అనేక వాహనాలతో భక్తులు భారీగా తరలివచ్చి పాల పొంగళ్ళు పొందించుకొని, గారెలు చలిమిడి వడపప్పు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తమ యొక్క మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ఈవో పర్యవేక్షిస్తున్నారు.

పట్టణ పార్టీ సారధ్యం బడుగులకేనా?

విస్సన్నపేట,మార్చి 14 (వార్తాప్రభ) : స్థానిక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు సామాజిక వర్గానికి చెందిన ఓలేటి దుర్గారావుకు పట్టం కట్టి తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్, విస్సన్నపేట మండల వైసీపీ సీనియర్ నాయకులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి నేటి రాజకీయ సామాజిక ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని పావులు కదిపినట్లుగా సర్వత్రా వినిపిస్తుంది. ఇదే బాటలో మాల సామాజిక వర్గానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముంగా జయరాజుకు అధికార ప్రతినిధి మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్యకు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవులు ఇచ్చి ఎస్సీ సామాజిక వర్గానికి సమన్యాయం చేశారని పలువురు అనుకుంటున్నారు. పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి ఇస్తే బాగుంటుందని పలువురు ఆశావహులు ఎదురుచూస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముదిరాజ్, రజక, గౌడ పద్మశాలి యాదవ, శాలివాహన, విశ్వబ్రాహ్మణ నాయి బ్రాహ్మణ తదితర సామాజిక వర్గాలవారు పట్టణ పార్టీ సారధ్యం వహించేందుకు ఆశావాహులు ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ బీసీ సామాజిక వర్గానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు మర్రిపోయిన వెంకటేశ్వరరావు(చిన్నోడు) మండల పార్టీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు తోపాటు మండల ప్రధాన కార్యదర్శి అడిగే శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి కూడా బీసీలు కావడంతో అత్యధిక శాతం బీసీ ఓట్ బ్యాంకు టిడిపి బిజెపి జనసేన కూటమి పార్టీల గెలుపుకు వారధి అయిందని కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. ఏది ఏమైన తిరువూరు నియోజవర్గ స్థాయిలో ఏ కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట నాలుగు మండలాల పరిధిలో వైసిపి అధిష్టానం తీసుకునే నిర్ణయాలపై విజయలక్ష్మి ఏ సామాజిక వర్గానికి పట్టం కట్టేది ఫలితాలు వెలువడే వరకు మిలియన్ డాలర్ల ప్రశ్నే అని పలువురు అనుకుంటున్నారు .

సి.ఐ. రమణమ్మకు గాయత్రి మహిళా సంఘం ఘన సన్మానం

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక నుండి నారీరత్న పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి డాక్టర్ పుల్లేటికుర్తి ఎస్ వి శ్రీనుబాబు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం మరియు శ్రీ గాయత్రి మహిళా సంఘం సభ్యులు సి.ఐ. రమణమ్మ ను దుశ్శాలువా, పూలమాల జ్ఞాపిక లతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ గాయత్రి విశ్వకర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు చింతలూరి ఉమాదేవి మాట్లాడుతూ మహిళలకు ముఖ్యంగా యువతకు సీ.ఐ. రమణమ్మ చేస్తున్న విశేష కృషిని కొనియాడారు. రమణమ్మ పొందిన అవార్డులను, రివార్డులను సభకు పరిచయం చేస్తూ గుడివాడ ఖ్యాతిని పెంపొందించే విధంగా వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలలో పాల్గొని అందిస్తున్న సేవను గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు చింతలూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిష్టాత్మక రాపాక ఏకాంబరాచార్యులు స్మారక పురస్కారాన్ని, విశ్వ కీర్తి బిరుదు ను రమణమ్మకు ప్రకటించి, అందించినట్లు తెలిపారు. పురస్కార గ్రహీత నారీరత్న సిఐ రమణమ్మ స్పందిస్తూ, సాంకేతికత పట్ల ఆకర్షితులైన నేటి యువత విలువలను మరచి ప్రవర్తిస్తున్నారని అందుకొరకు తల్లిదండ్రులు వారి బిడ్డలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమాజానికి విలువైన పౌరులుగా తీర్చి దిద్దగలరని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు ముంతా వెంకటేశ్వరరావు, మహిళా సంఘం ఉపాధ్యక్షులు జ్వాలా మంజుల, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉపాధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, వై. విజయలక్ష్మి, కాశీ వరలక్ష్మి, తీర్థం నారాయణ, కె.నారాయణ రావు, వై.ఈశ్వరి, వెంకట నాగలక్ష్మి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వభారతి 57వ వార్షికోత్సవ వేడుకలు

● అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు..

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : స్థానిక విశ్వభారతి ఇంగ్లీషు మీడియం ప్రాథమిక పాఠశాల నందు 57వ వాఠశాల వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల డైరక్టర్ మంజుల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించగా, ప్రపంచమంతా ఒక వసుదైక కుటుంబమన్న భావనతో చైనా సాంప్రదాయ నృత్యం, రష్యన్ బ్యాలె నృత్యం వంటి పలు సాంస్కృతిక నృత్యాలతో చిన్నారులు ప్రేక్షకులను అలరింపజేశారు. పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లి పాత్ర ప్రాధాన్యతను జిజియాబాయి, శివాజీల పాత్రల ద్వారా చిన్నారులతో చక్కగా ప్రదర్శింపజేశారు. 2024 -25 విద్యాసంవత్సరంలో నిర్వహించిన చెస్ చాంపియన్ షిప్ పోటీలలో విజేతలుగా నిలిచిన ఏ. శ్రీ రంగనాథ్ 7వ తరగతి, డి. మహిమారాతుల్ 5వ తరగతి, ఏ. సోఫీ ఆరాధ్య 3వ తరగతి చిన్నారులకు పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరక్టర్ ఆర్. మంజుల, ప్రిన్సిపాల్ కె. రాధ లు ట్రోఫీలను అందించి అభినందించారు. పాఠశాల వార్షిక వేడుకలు అద్భుతంగా నిర్వహించడానికి తమ చిన్నారులను ప్రోత్సహిస్తూ సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి పాఠశాల యాజమాన్యం తరపున ప్రిన్సిపాల్ రాధ కృతజ్ఞతలు తెలియజేశారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం - గుడివాడ ఎమ్మెవో బాలాజీ

● 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరి సౌకార్థ్యం మినరల్ వాటర్ సరఫరా..

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరగబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారీ ఆధ్వర్యంలో ఎ.జి.కె. మునిసిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ప్రారంభ కార్యక్రమం.. గుడివాడ మండల విద్యాశాఖ అధికారి బి.బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మీవో బాలాజీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా రోటరీ క్లబ్ అత్యంత ఖరీదైన ఈ ప్రాజెక్టును నిర్వహించడం హర్షణీయమని, భవిష్యత్తులో ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ మార్చి నెల "వాటర్ అండ్ శానిటేషన్" నెలగా రోటరీ తో డెజిగ్నేట్ చేయబడిందని ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గుడివాడ పట్టణంలోని 14 పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు వ్రాయుచున్న విద్యార్థులకు మంచినీటి సరఫరా చేయడం ఎంతో సంతోషకరంగా ఉన్నదని, ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ సభ్యుల సహకారంతో గత మూడు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నామని, సభ్యుల సహకారం ఎనలేనిదని కొనియాడుతూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు ఎం.రమణమూర్తి, ఈ సర్వీస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.ఎస్.వి.ఎన్.మారుతి కుమార్, సభ్యులు ఎ.జె.ప్రసాద్, ఎ.మహదేవ దేశాయ్, ఎ.జి.కె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.ఎల్. నర్సమాంబ, పాఠశాల ఉపాధ్యాయులు డి.చంద్రశేఖర్, ఎ.ఎస్.వి .ప్రసాద్, జి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్య నాయక్ తండా లో ఘనంగా "హోలీ" వేడుకలు..

కంచికచర్ల,మార్చి 14 (వార్తాప్రభ) : కంచికచర్ల పట్టణం లోని ఇందిరా కాలనీ సూర్య నాయక్ తండ వాసులు కుల మత భేదాలు లేకుండా, ఆడ మగ, చిన్న పెద్ద అనే భేదం లేకుండా అందరూ సమైక్యత తో రంగులు చల్లుకొని ఆనంద ఉత్సాహాలతో, డిజే పాటల నృత్యాలతో ఒకరికి ఒకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ రాజ్ చీఫ్ భూక్య బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగ ప్రజల అందరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని, దేశ సమైక్యతకు హోలీ పండుగ ఒక నిదర్శనమని, కుల మతాల కు అతీతంగా దేశ వ్యాప్తంగా ప్రజ లందరు జరుపుకునే పండుగ లలో హోలీ పండుగ ఒకటని ఆయన అన్నారు. ద్వారకా నగరంలో హోలీ పండుగను మహా పెద్ద పండుగగా కొన్ని రోజులపాటు జరుపు కుంటారన్నారు.హోలీ పండుగ సందర్భంగా రసాయనాలు కలిసిన కలుషిత రంగులను ఉపయోగించ వద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం సూర్య నాయక్ తండా వాసులు పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్ ను శాలువాలతో పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్య నాయక్ తండా, ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు,వ్యాపారస్తులు, సూర్య నాయక్ తండా వాసులు మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లాది శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ టీవీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

కోడూరు, మార్చి 14 (వార్తాప్రభ) : శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పాల్గొన శుద్ధ పౌర్ణమి ఉత్తరా నక్షత్రం నందు అయ్యప్ప స్వామి జన్మదిన సందర్భంగా స్వామివారి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను గురు స్వామి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్ కు పంచామృత అభిషేకం, గణపతి, షణ్ముఖ, అయ్యప్ప , మాలికాపుర త్తమ్మ ఆవాహిత దేవతలకు హెూమములు నిర్వహించారు. అనంతరం 108 లీటర్ల ఆవుపాలతో భక్తుల స్వహస్త హస్తాలతో స్వామివారికి పాలాభిషేకం నిర్వహించ నున్నారు. అనంతరం 5000 మందికి అన్న ప్రసాద వినియోగం చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త బడే భావనారాయణ తెలిపారు. కావున యావన్మంది భక్తులు పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా కార్యదర్శిగా వెంపటి సైమన్

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : గురువారం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ కృష్ణాజిల్లా వైఎస్సార్సీపీ కార్యదర్శిగా గుడివాడ నియోజకవర్గానికి చెందిన వెంపటి సైమన్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడు దల చేసింది. వైస్సార్సీపీ విడుదల చేసిన కృష్ణ జిల్లా కమిటీ లో స్థానం కల్పించిన సందర్భంగా, పార్టీ అధ్యక్షులు వై. ఎస్ జగన్ మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి కొడాలి నానికి, దుక్కిపాటి శశిభూ షణ్‌కి, మండలి హనుమంతరావుకి, చుండూరు శేఖర్, ఆంజనేయప్రసాద్, కృష్ణ, యస్సయ్య లకు సైమన్ కృతజ్ఞతలు తెలియచేసారు.

17న గుడివాడలో శ్రీ లక్ష్మీగణపతి హోమం

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : మెయిన్ రోడ్ లో వెంచేసియున్న శ్రీ విగ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో ది. 17.03.2025 సోమవారం సంకష్ట హర చతుర్థి పర్వదినము సందర్భముగా శ్రీ స్వామివారి ఆలయ ఆవరణలో వేదపండితుల ఆధ్వర్యములో శ్రీ లక్ష్మీగణపతి హెూమం పూజా కార్యక్రమము జరుగునని కార్యనిర్వాహణాధికారి వై. శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్ లు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమములో పాల్గొను వారు రు. 516/-లు దవస్థానం ఆఫీస్ నందు చెల్లించి.. తమ గోత్రనామములు నమోదు చేసుకోవలసినదిగ కోరుచున్నాము. ఈ పూజలో పాల్గొను ఉభయదతలకు పూజా సామాగ్రి దేవస్థానం వారే సమకూర్చేదరు. అలాగే వారికీ స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రం, బ్లౌజ్ పీస్ ఇవ్వబడును. కావున భక్తులు యావన్మాంది ఈ హెూమం పూజా కార్యక్రమములో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకావలసినదిగ కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఛలో పిఠాపురంకు తరలివెళ్లిన గుడివాడ జనసేన శ్రేణులు

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు శుక్రవారం (14-3-25) ఉదయం 9 గంటలకు గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం నుంచి ఉదయం పిఠాపురం భారీగా 2 బస్సులు 20 కారులతో భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అందరం పిఠాపురం సభకు తరలి వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, షేక్ మీరా షరీఫ్, వినోద్, సుంకర వెంకట్, ఆంజనేయలు, బుడమా రాజు, వైస్సార్, సాయికృష్ణ, భాను, నరసయ్య, వీరామహిళలు భవాని, శిరీషా, సౌమ్య, కుమారి అంటి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

నాటు సారాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

● ఐదు లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

మైలవరం,మార్చి 14 (వార్తాప్రభ) : నాటు సారాయి తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎస్ఐ ఎం. దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి శనివారం అరెస్ట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మండలం, అన్నేరావుపేట తండాకు చెందిన భరోతు రాము అనే వ్యక్తి వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాయి స్వాధీన పరచుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.అరెస్ట్ చేసిన రాము ని మైలవరం కోర్టు లో హాజరుపర చగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలియజేశారు.రాము కి సారా సరఫరా చేసిన గంటిపాడు తండా,చాట్రాయి మండలం కు చెందిన భరోత్ కుమార్ మీద కేసు నమోదు చేయటం జరిగిందని వెల్లడించారు. అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ స్పష్టంచేశారు.ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ నాగరాణి, కానిస్టేబుల్స్ సాయి, సర్వేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదిక అర్జీలకు తక్షణ పరిష్కారం : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● 22వ వార్డులో ప్రజా వేదిక నిర్వహించిన ఎమ్మెల్యే.. ప్రజల నుండి అర్జీలను స్వీకరించి..

పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక 22వవార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గురువారం ఉదయం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా రైలు పేటలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక శిబిరంలో కూటమి శ్రేణులతో కలిసి.. ఎమ్మెల్యే రాము ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికా రులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకున్నారు. అనంతరం ద్విచక్ర వాహనంపై వార్డులో ఎమ్మెల్యే రాము పర్యటిస్తూ.. ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల వారీగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు తన దృష్టికి వచ్చిన సమస్యల్లో అత్యధిక సమస్యలను తక్షణమే పరిష్కరించామని.. ఆర్థికపరమైన సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, 22వ వార్డు టిడిపి నాయకులు నాయకులు ఆకారపు రాజేష్, సౌకత్ జానీ, గుడివాడ తెలుగుదేశం పార్టీ నాయకులు పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహనరావు, కొడాలి బాలు, గడ్డం ప్రకాష్ దాస్, పురపాలక సంఘ మరియు సచివాలయ ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, నందమూరు
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.నిల్/2025 తేది. 14.03.2025.

కృష్ణాజిల్లా, పెడన మండలం, నందమూరు గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2025 నుండి 31.03.2026 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు స్వీకరించు తేదీలు 14.03.2025 వ నుండి 20.03.2025 వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు ఉదయం గం. 11-30ని.లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

వ.నెం	పని వివరము	కాల పరిమితి	ధరావత్తు
1)	వీధి విద్యుత్ నిర్వహణా పనులు ఒక వ్యక్తీ సేవలు	01.04.2025 నుండి 31.03.2026 వరకు	రూ.1000/-
2)	గార్బేజ్ టిప్పర్ డ్రైవరు ఒక వ్యక్తీ సేవలు	1.04.2025 నుండి 31.03.2026 వరకు	రూ.1000/-

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును
3. టిప్పర్ డ్రైవరు పోస్టుకి అప్లై చేయు వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితి కలిగినదై యుండవలెను. ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరిగా చేయించుకోనిఉండాలి.

సం/- శ్రీపరసా నర్సింహావు
సర్పంచ్
నందమూరు గ్రామ పంచాయితీ

సం/- డి.వి.ఎన్.జానకిలక్ష్మి
కార్యదర్శి
నందమూరు గ్రామ పంచాయితీ

నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

● వైసిపి మండల అధ్యక్షుడు భైరవలింగం



పెడన,మార్చి 14 (వార్తాప్రభ) : నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఉప్పాల రాము నాయకత్వంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని నూతనంగా నియమించబడిన పెడన మండల వైసీపీ అధ్యక్షుడు దావు వీర వెంకట నాగ భైరవలింగం చెప్పారు. అధ్యక్షునిగా నియమితుడైన నేపథ్యంలో ఆయన శుక్రవారం సాయంత్రం వార్తా ప్రభ ప్రతినిధి తో మాట్లాడారు.కొంకేపూడి గ్రామ ఎంపీటీసీగా సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించిన భైరవలింగం కు మండలస్తాయి పదవి కత్తి మీద సాము లాంటిదే అని చెప్పవచ్చు. తనమీద రాము పెద్దబాధ్యతే పెట్టారని అన్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన కొండవీటి నాగబాబు ఓసీ కాపు కాగా భైరవలింగం బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందినవారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉప్పాల కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే కాగిత

పెడన,మార్చి 14 (వార్తాప్రభ) : అభివృద్ధి తోపాటు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెడన శాసనసభ్యుని కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయక నిధి చెక్కులను అయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అనేక ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న 42 మందికి రూ.32,60,145 అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ ఆర్థిక పరిస్థితిని చూసి ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేసి ఆర్థికంగా అండగా నిలబడిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బాధితులు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ డి సీ చైర్మన్ లు పోతన స్వామి నాయుడుబొర్రా కాశీకాసగాని శ్రీనివాసరావు కట్టా మునీశ్వరావు కునపరెడ్డి వీరబాబు శొంఠి రాము తదితరులు పాల్గొన్నారు.

వై యస్ ఆర్ పార్టీ మండలం అధ్యక్షులుగా జల్లా భూపతి రాజు నియామకం..

కృత్తివెన్ను,మార్చి 14 (వార్తాప్రభ) : రాష్ట్ర వైయస్సార్ సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి దిగువ స్థాయి నుంచి పార్టీ ప్రక్షాళనకు నాంది పలికారు ప్రక్షాళనలో భాగంగా పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఉప్పాల రమేష్ జిల్లాస్థాయిలో పార్టీ కమిటీని ఏర్పాటు చేశారు కృష్ణా జిల్లా వైఎస్సార్సీపీ వైస్ ప్రెసిడెంట్ గా కృత్తివెన్ను మండలానికి చెందిన సీనియర్ నాయకులు పిన్నింటి మహేష్ ను నియమించారు మండల వైఎస్సార్సీపి అధ్యక్షులుగా జల్లా భూపతి ని నియమించారు. వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులుగా తనను నియమించినందుకు గాను జల్లా భూపతి హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ కృత్తివెన్ను మండలంలో వైయస్సార్ పార్టీని మరింత బలోపేతం చేసి మండల స్థాయి నాయకులను కార్యకర్తలను కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అవిరళ కృషి చేస్తానని తెలిపారు

వైకాపా హయంలో జరిగిన అవినీతిపై సిఐడి ఎంక్వయిరీ చెయ్యాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● మున్సిపల్ సొసైటీ లిమిటెడ్ కుంభకోణాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన కార్మికులు..

22 ఏళ్ళ క్రితం చనిపోయిన వ్యక్తిపై రుణాలు తీసుకోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. సొసైటీ కార్యాలయానికి వెళ్లి కార్మికులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే రాము..

గుడివాడ,మార్చి 14 (వార్తాప్రభ) : వైకాపా హయంలో గుడివాడ నియోజకవర్గంలో జరిగిన అవినీతిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి.. సిఐడి ఎంక్వైరీ కోరతానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ మున్సిపల్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాన్ని.. సొసైటీ కార్మికులు శుక్రవారం ఉదయం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. 22ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిపై కూడా 2022లో 10 లక్షల రుణం తీసుకున్నారని కార్మికులు చెప్పడంతో ఎమ్మెల్యే రాము ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సభ్యులతో కలిసి సత్యనారాయణపురం లోని సొసైటీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే రాము.. రుణాల అవకతవకలపై గుమస్తా రాజును వివరణ అడిగారు. తాను నలుగురు సభ్యులకు చెందిన 40 లక్షలు వాడుకున్నానని, ఇతర సొసైటీ సభ్యుల రుణాల వివరాలన్నీ అధ్యక్షురాలు లక్ష్మికే తెలుసని గుమస్తా రాజు ఎమ్మెల్యే రాముకు చెప్పడంతో, విషయం విన్న కార్మికులందరూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ చేసి దర్యాప్తు చేపట్టాలని వన్ టౌన్ పోలీసులకు ఎమ్మెల్యే రాము సూచించారు. జరిగిన అవినీతిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సిఐడి విచారణ చేయాల్సిందిగా కోరుతానని సభ్యులకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. తరువాత విలేకర్లతో మాట్లాడుతూ ఈ అవినీతిలో వైకాపా నేతల పాత్ర కూడా ఉండడం దుర్మార్గమన్నారు. సుమారు ఎనిమిదిన్నర కోట్ల మేర అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, పూర్తిస్థాయి విచారణ చేయాల్సిందిగా ఇప్పటికే పోలీసులకు సూచించామని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కార్మిక సంఘ నాయకుడు వడ్డాది నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, గడ్డం ప్రకాష్ దాస్, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పదవుల పంపిణీలో విధేయతకు పెద్దపీట వేసిన ఉప్పాల రాము

పెడన,మార్చి 14 (వార్తాప్రభ) : నియోజకవర్గం లో వైసిపి ప్రక్షాళనకు ఇంచార్జి ఉప్పాల రాము శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండల స్థాయి అధ్యక్షులతో పాటు కొన్ని కీలకమైన పార్టీ పదవుల్లో మార్పులు చేర్పులు చేస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే పదవుల కేటాయింపుల్లో రాము తనదైన ముద్ర చూపించారు. విధేయతకు పట్టం కట్టడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. తనకు అత్యంత విధేయత గా ఉండే దావు భైరవలింగం ముత్యాల నాగేశ్వరరావు కర్ణ శ్రీనివాసరావు సమ్మెట జయవర్ధన్ జల్లా భూపతి లాంటి నాయకులకు మండల బాధ్యతలు అప్పగించడంతో పాటు జిల్లాకు పంపించిన ఉపాధ్యక్షుడు పిన్నింటి మహేష్ అధికార ప్రతినిధి గరికపాటి రామానాయుడు ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్ తో పాటు ఇతర పదవులు పొందిన వారు కూడా ఓటమి తర్వాత తన అడుగులో అడుగు వేస్తూ నడుస్తూ వచ్చిన వారేకావడం విశేషం. తప్పటడుగులు (అర్థమయిందనుకుంటా)వేసిన వారికి ఎక్కడా కూడా కొత్తగా వేసిన పదవులలో స్థానం కల్పించబడలేదు.ఏ కొద్దిపాటి రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారికైనా సరే ఈ విషయం అర్థం అవుతుంది. స్వపక్షంలోనే ఉంటూ విపక్షంగా వ్యవహరిస్తున్న నాయకులు మీద రాము తనదైన శైలి లో ట్రీట్మెంట్ ఇచ్చినట్టుగా కనిపిస్తుంది. ఇదంతా భవిష్యత్తు వ్యూహరచన లో భాగం కావొచ్చు.అయితే పార్టీకి వీరి సేవలు కూడా అవసరమే. మరి వారిని కూడా కలుపుకొని వెళ్లవలసిన అవసరం ఉప్పాల మీద వుంది.

అయ్యప్ప నామస్మరణతో విలసిల్లిన కోడూరుపాడు

హనుమాన్ జంక్షన్,మార్చి 14 (వార్తాప్రభ) : బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో శుక్రవారం ఆధ్యాత్మిక చింతనతో మునిగి పోయింది. గత 18 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన గురు స్వామి చందు శ్రీనివాసరావు , వైస్ ఎం పి. పి చందు రమాదేవి దంపతులు అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇది 18 వ సంవత్సరం కావటంతో గ్రామంలోని కోదండ రామ స్వామి దేవాలయంలో అయ్యప్ప జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా కన్నుల పండగగా నిర్వహించారు. కేరళ అయ్యప్ప ఆలయ పూజారి మురళీధరన్ నంబూద్రి స్వయంగా వచ్చి కేరళ ఆచారంతో శబరిమల లో జరిగేటట్లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజ్జామున శ్రీ లక్ష్మీ గణపతి హోమం, పూర్ణహుతి, అష్ట ద్రావ్యాభిషేకం పెద్దఎత్తున నిర్వహించారు, గుర్రాల రథం, కేరళ వాయిధ్యాలతో భక్తి ప్రపత్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా ఉదయం సి ఎస్. ఐ. స్కూల్ లో. ఎర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును జె.డి, లక్ష్మీనారాయణ ఐ పి ఎస్, మురళీ ధరన్ నంబూద్రి ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ తోట, డాక్టర్ అనిల్ కుమార్ నరాలశెట్టి, డాక్టర్ సాంబశివరావు చందు సిబ్బంది పాల్గొన్నారు, జె డి లక్ష్మీ నారాయణ ఐ పి ఎస్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యప్ప భక్త బృందం, కోడూరుపాడు గ్రామ ప్రజలు చందు శ్రీనివాసరావు, రమాదేవి కుటుంబ సభ్యుల సహకారంతో గ్రామం అయ్యప్ప నామ స్మరణతో మారుమ్రోగింది, కోడూరుపాడు చుట్టుప్రక్కల గ్రామాలనుండి భక్తులు తరలివచ్చారు, పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమాలను తిలకించేందుకు యోదాను యోధులు, పలువురు ప్రముఖులు గ్రామాన్ని సందర్శించారు, వచ్చిన ప్రముఖులను నిర్వాహకులు సన్మానించారు, అతిథిగా వచ్చిన జె డి ఈ సందర్భంగా జె డి. లక్ష్మీ నారాయణ ఐ. పి. ఎస్, మాట్లాడుతూ పార్టీలు ఎన్నికలవరకే ఉండాలని అన్నారు. అలాగే ఏ ప్రభుత్వం మంచి పనిచేసిన అభినందించాలన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా ప్రభుత్వాలు పంచాయతీలకు ప్రతి ఏటా రెండు కోట్ల రూపాయలు కేటాఇంచాలన్నారు, భారత దేశం గ్రామాల్లో ఉందని అధికార వికెంద్రికరణ కావాలని అన్నారు, అనాడే దేశం పురోభివృద్ధి చెందుతుందాన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయవాడమార్చి 14 (వార్తాప్రభ) : ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ 23వ డివిజన్ సూర్యారావుపేట జగడంవారి వీధిలోని అర్చన కిడ్నీ అండ్ స్కిన్ కేర్ ఆసుపత్రిలో మార్చి 13వ తేదీన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ప్రారంభించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.ఈ శిబిరం లో అర్చన కిడ్నీ అండ్ స్కిన్ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ గొరిపర్తి శశిధర్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన పెంచడం, సంబంధిత సమస్యలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం, వ్యాధుల నివారణ, చికిత్స గురించి తెలియజేయటమే లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు.గురు,శుక్ర, శని వారాల్లో మూడు రోజుల పాటు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. విజయవాడ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రజానీకం ఈ ఉచిత కిడ్నీ వ్యాధుల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

శ్రీ తిరుపతమ్మ కు తొలిపొంగళ్లు సమర్పించిన మాదిగ చింతయ్య వారసులు

పెనుగంచిప్రోలు,మార్చి 14 (వార్తాప్రభ) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాల మహోత్సవంలో భాగంగా తొలి పొంగళ్లు సమర్పించిన మాదిగ చింతయ్య వారసులు,పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాల మహోత్సవంలో భాగంగా,శుక్రవారం ఉదయం తొలి బోనం, మాదిగ కుల బోనాలు సమర్పించిన పెనుగంచిప్రోలు మాదిగ చింతయ్య వారసులు,మాదిగకులస్తులు.అమ్మవారి దర్శనం అనంతరం వీరికి దేవస్థాన అధికారులు స్వామివారి శేష వస్త్రం తీర్థ ప్రసాదాలను అందజేశారు,ఈ కార్యక్రమంలో మాదిగ చింతయ్య వారసులు, పెనుగంచిప్రోలు గ్రామం మాదిగ కులస్తులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ కు ఆక్సిజన్ కాన్స్ స్టేటర్ అందజేసిన కాగిత

పెడన,మార్చి 14 (వార్తాప్రభ) : పట్టణంలో పెడన అర్బన్ హెల్త్ సెంటర్ కు 90 వేలు విలువైన ఆక్సిజన్ కాన్స్ స్టేటర్ ను ఆసుపత్రి వైద్యురాలు నందినికి శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అందజేశారు. పేద ప్రజలకు విద్య వైద్యం అందించడం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాగిత అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు కుటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం మండల సమావేశం

గిద్దలూరు,మార్చి 14 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలం కమిటీ సభ్యులు ఎన్నుకోవడానికి సమావేశం జరిగినది. ఈ సమావేశంనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ వెంకటయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్, విశిష్ట అతిథిగా నియోజకవర్గ అధ్యక్షులు జంగాల బాలయ్య యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు పి మాధవ యాదవ్ లు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో రాచర్ల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొనుట జరిగింది. రాచర్ల మండల అధ్యక్షులుగా డి నరసింహులు యాదవ్, ఉపాధ్యక్షులుగా వేల్పుల కోటేశ్వరరావు యాదవ్ ఇంకా గోపాల యాదవ్ ప్రధాన కార్యదర్శిగా, మేకల నరసింహులు యాదవ్ గౌరవాధ్యక్షులుగా, వేల్పుల సాయన్న యాదవ్, గోమసాని భాష యాదవ్, లోమడా శ్రీనివాస్ యాదవ్, పుల్లయ్య యాదవ్ లు కార్యదర్శులుగా, రామరాజు యాదవ్ తిరుపాల్ యాదవ్ గోవిందరాజు యాదవ్ కోశాధికారిగా పాండురంగ యాదవ్ తదితరులను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభాధ్యక్షులు ఓ వెంకటయ్య యాదవ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలలో మరియు అన్ని గ్రామాలలో కమిటీలు వేసి యాదవుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయుటకు మరియు యాదవుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుదాము అని తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా యాదవులకు పోలీస్ స్టేషన్ మరియు ఎమ్మార్వో ఆఫీస్ ఎటువంటి సమస్య వచ్చిన యాదవుల సమస్యలపై పోరాడడానికి పోలీస్ స్టేషన్ కు మరియు ఎంఆర్ఓ ఆఫీస్ కు మేము కచ్చితంగా హాజరై యాదవుల సమస్య తీరేంతవరకు ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం వారికి అండగా ఉంటుందనన్నారు. విశిష్ట అతిథి జంగాల బాలయ్య యాదవ్ మాట్లాడుతూ తిరుపతి తిరుమల దేవస్థానం లో తొలిదర్శనం తుదిదర్శనం చేసుకునే భాగ్యం యాదవులకి ఆ దేవదేవుడు కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి యాదవ్ ఇచ్చిన వరం, అటువంటి గొప్ప వంశంలో పుట్టడమే యాదవులుగా మనందరం అదృష్టం చేసుకొని ఉన్నామన్నారు.రాచర్ల మండల అధ్యక్షుడుగా ఎన్నికైన డి నరసింహులు యాదవ్ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో జీవాలకి మేత గ్రామాలలో దొరకదు కనుక జీవాలు మేపుకోవడానికి అడవిలోకి వెళ్లడం వెళ్లడం జరుగుతుంది కానీ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు జీవలను అడవిలోకి అనుమతించడం లేదు ఈ మండలంలో వందలాదిమంది గొర్రెల కాపర్లు ఈ సమస్య తోటి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. జిల్లా యూత్ ప్రెసిడెంట్ పి మాధవ యాదవ్ మాట్లాడుతూ ఆరు మండలాల్లో మరియు నియోజకవర్గంలో యూత్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అన్ని మండలాలలో యాదవ కుటుంబ సభ్యులందరూ వాట్సాప్ గ్రూప్ లో వారి పేరు నమోదు చేసుకొని ఆయా గ్రామాలలో కుటుంబ సభ్యులందరినీ చేర్పించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయవలసిందిగా సమావేశంలో కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి కే శ్రీనివాసులు యాదవ్, గిద్దలూరు మండల యాదవ సంఘం అధ్యక్షులు నంద్యాల చిన్న ఈశ్వరయ్య యాదవ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్ పీరయ్య యాదవ్, గిద్దలూరు నియోజకవర్గ కోశాధికారి ఎస్ అల్లూరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188